

## మహిళపై హత్యాయత్నం

రేణిగుంట, మార్చి 22 ప్రభాతవార్త
రేణిగుంట మామండూరులో తూకివాకం మునెమ్మ (36)ను పి.కృష్ణమూర్తి అనే యువకుడు కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడి ఆపై తాను కూడా అదే కత్తితో పొడుచుకున్న సంఘటన ఆదివారం రేణిగుంట మండలం మామండూరులో సంచలనం రేపింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మామండూరు గ్రామానికి చెందిన మునెమ్మ అమరరాజా కంపెనీలో నైట్ డ్యూటీకి వెళ్లి తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన కృష్ణమూర్తి ఆమెను అడ్డగించి తనతో ఇది వరకటిలాగా చనువుగా ఉండాలని ఒత్తిడి తెచ్చాడు. ఆమె అంగీకరించకపోవడంతో తన వద్ద ఉన్న కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను బంధువులు కరకంబాడి సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. ఆ తరువాత సుబ్రమణ్యం అదే కత్తితో తనను తాను పొడుచుకొని గాయపడ్డాడు. ప్రస్తుతం అతను తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితునిపై రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


# తిరుపతి - చిత్తూరు

30 ఏళ్ల ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త


## గోవింద అంటే కష్టాలు తొలగిపోతాయి
### -టేబుల్‌టెన్నిస్ క్రీడాకారిణి నైనాజైస్వాల్

తిరుమల,మార్చి 22 ప్రభాతవార్తప్రతినిధి:
శ్రీవేంకటేశ్వరుడు అందరి దేవుడని, గోవింద అని పిలిస్తే అందరి కష్టాలు తొలగిస్తాడని టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనాజైస్వాల్ విశ్వాసం వ్యక్తం చుశారు. పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఆశీస్సులు ఆనందంతో నిండిన ఈ ప్రత్యేకమైన రోజు మరింత స్మరణీయంగా మారిందని అన్నారు. ఈ సందర్భంగా ఆమెకు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పారిశ్రామికవెత్త జి .పృధ్వీరెడ్డి శ్రీవారి చిత్రం బహుకరించారు.



# చరిత్ర ఘనం: పర్యవేక్షణ ప్రశ్నార్థకం



తొండమాన్ పురం ఆలయం, పెరుమాళ్ స్వామి

**శ్రీకాళహస్తి మండలం లోని తొండమాన్‌పురంలో టిటిడికి సంబంధించిన చారిత్రక ఆలయం 'ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం.ఈ ఆలయం పర్యవేక్షణ నేటికి టిటిడి పర్యవేక్షణలోనే ఉంది. ఈ ఆలయాన్ని ఈ ప్రాంతాలను పరిపాలించిన తొండమాన్ చక్రవర్తి నిర్మించినట్లు అధారాలున్నాయి. ఈ ఆలయానికి సంబంధించి మడి మాన్యాలున్నాయి. రికార్డుల ప్రకారం ఆగర్తాలు,కోటగట్లు,రెడ్డి గుంట లు ఉన్నాయి. ఇక్కడ నిత్య కైంకర్యాలు టిటిడి నిర్వహిస్తుంది. అభివృద్ధికి నిధులు కేటాయిస్తుంది. టిటిడిలో నిర్వహించే ప్రతి ఉత్సవం ఈ ఆలయంలో నిర్వహిస్తున్నారు. టిటిడి అభివృద్ధికి సంబంధించి కట్టుదిట్టమైన చర్యలు, నిధులు ఓకేటాయిస్తున్నా ఆలయ ఆస్తులను కాపాడటంతో చొరవ చూపటం లేదని తెలుస్తుంది. ఆలయ భూముల్లోంచి వెనుక ఉన్న అసైన్‌మెంట్ భూములకు ఆలయాస్తుల్లోంచి రోడ్డు నిర్మాణానికి అనుమతించటంపై వివాదాలు చోటు చేసుకున్నాయి.**

### తొండమాన్ పుర ఆలయ భూముల్లో రోడ్డు నిర్మాణం: అధికారుల నిర్లక్ష్యం

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి రూరల్)
శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం పురావస్తు శాఖ పర్యవేక్షణలో ఎన్నో అంశాలు వెలుగులోకివచ్చినట్లు మనకు ఆధరాలున్నాయి,వారి సర్వే మేరకు విజయనగరరాజుల కాలం నాటి శిల్పాలు నాయకర్ చిత్రలేఖనాలు మరియు తిరుపతి ఆలయాన్ని నిర్మించిన తొండమాన్ చక్రవర్తితో దాని సంబంధానికి ముఖ్యమైన చారిత్రతత్మక ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంపై దృష్టి పెట్టింది. ఈ ప్రాంతంలో పురాతన శాసనాలు ప్రత్యేకమైన ఆలయ నిర్మాణం, భారీ స్థంభాలు, వాటిపై చెక్కిన మండపాలకు సంబంధించి పేర్కొనబడింది. ఇతిహాసాలు,పురాణాల మేరకు తొండమాన్ చక్రవర్తి, వృద్యాప్యంలో తిరుమలకు రోజు వారి తీర్థయాత్రలు చేయలేక తొండమాన్ పురంలో ఆలయానినఇన నిర్మించినట్లు సమాచారం. ఈ ఆలయంలో విజయనగర రాజుల కాలం నాటి అష్టభుజ కట్టడాలతో కూడిన భారీ చతురస్రాకార స్థంభాలు, చెక్కబడిని ముఖ భాగాలు దేవతల విగ్రహాలు, మండపాలు నిర్మించి ఉన్నారు.

**స్థల పురాణం:**
తొండమనాడులోని ఆలయంను తిరుమల ఆలయాన్ని నిర్మించిన ప్రసిద్ధి చెందిన రాజు తొండమాన్ చక్రవర్తితో ముడిపడి ఉంది. స్థల పురాణాన్ని పరిశీలిస్తే స్థానిక సంప్రదాయం ప్రకారం తొండమనాడు అనేది వెంకటేశ్వరస్వామి జీవించిన ప్రదేశం వసుదాసు,తొండమాన్ మధ్య రాజ్యం విషయంలో జరిగిన విభజనకు దారి తీసినట్లు పురావస్తు శాఖ చారిత్రక ఆధారాలున్నాయి. తొండమనాడు తుండరి మండలం పొందిన తరువాత తిరుమలలో ఆలయాన్ని నిర్మించాడు. ఈ ఆలయం తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి మండలంలోని పలు ప్రాంతాలను చోళ రాజవంశస్తులు పరిపాలించినట్లు రికార్డులు చెబుతున్నాయి. పురావస్తుశాఖ నివేదికల మేరకు తొండమనాడు సమీపంలోని ప్రధాన ప్రదేశంను పూర్వ పెరుమాళ్ళు స్వామిగా కొలిచే వారని చెబుతున్నారు. ఈ ఆలయంలోని స్వామి విగ్రహాన్ని పరిశీలిస్తే రక్షిత స్మారక చిహ్నంఇది అభయ హస్త ముద్రలో స్వామి వారు కూర్చొని ఉండటంతో ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయాన్ని తొండమాన్ చక్రవర్తి నిర్మించారు. దీని పర్యవేక్షణ నేడు టిటిడి పర్యవేక్షిస్తుంది. గతంలో తిరుపతి పార్లమెంటు సభ్యుడుగా ఉన్న డాక్టర్ చింతా మోహన్ ఈఆలయానికి పర్యటక శాఖకు అనుబంధం చేసి తిరుపతి నుంచి ప్యాకేజ్ బస్సులను నడపాలని ప్రయత్నించారు.

**రేపటి సంచికలో**
ఆస్తుల పరిరక్షణలో ఎందుకింత నిర్లక్ష్యం?

### దశాబ్దాలుగా
# జానడు జాగాకు దిక్కేది..?

**- గుడారాలే ఆధారం..!!**
**- దయనీయ, దుర్భర దుస్థితిలో ఎరుకుల బతుకులు**



చిట్టమూరు, మార్చి 22, ప్రభాతవార్త
ఒక కుటుంబానికి ఆత్మగౌరవం, జీవనాధారం, భవిష్యత్తుకు భరోసా సొంత ఇల్లు, ప్రతి పేదవాడి సొంతింటి కల సహకారం మా ప్రభుత్వాల లక్ష్యమని నిత్యం పాలకుల నోటి వెంట వెలువడే మాటలు ఇవి. నేడు జానడు జాకాకు దిక్కు లేక గుడారాల్లో దశాబ్దాలు పాటు గుడిసేటి బతుకులు గడుపుతున్న దుస్థితి మండలంలోని దరఖాస్తులో నెలకొంది. సొంతింటి కల కల్లగా మారడంతో నిత్యం దయనీయ, దుర్భర దుస్థితిలో మగ్గుతున్న ఎరికుల బతుకులు ప్రభుత్వాల చేతగాని తీరుకు నిదర్శనంగా ఉన్నాయి. సొంతింటి కల మాటేమో గానీ జానెడు జాగాకు నోచుకోక పిల్లాపాపలతో కాలం గడుపుతూ జీవనం కొనసాగిస్తున్న దరఖాస్తు ఎరుకుల జీవితాలు ప్రభుత్వాలు తీరుకు ప్రశ్నలుగా మిగిలిపోయాయి. వివరాల్లోకెళ్తే చిట్టమూరు మండల పరిధిలోని చిన్న దరఖాస్తు గ్రామంలో సుమారు 20 గిరిజన కుటుంబాలు గత 20 సంవత్సరాలుగా జీవిస్తున్నారు. అయితే నిత్యం రెక్కాడందే డొక్కనిండని గిరిజన వలస పక్షులు ఏదో ఒక ప్రాంతానికి వెళ్లి తమకు తెలిసిన విద్య అయిన బుట్టలు, ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకుని జీవనాధారం చేస్తున్నారు. వీరు నివాసం ఉంటున్న ప్రాంతంలో ఇప్పటికే పలువురు ఖాళీ స్థలాలను ఆక్రమించుకుని దర్జాగావాములు పంట పొలాలుగా మార్చుకోవడంతో గిరిజనులు నివాసం ఉండేందుకు సెంటు భూమి అందుబాటులో లేకపోవడంతో వారందరూ పిల్లాపాపలతో సమీప వీధిలోని పట్టలు కట్టుకొని కాలం వెలదీస్తున్న దుస్థితి. ప్రభుత్వాలు మారుతున్న వీరి తలరాతలు మాత్రం మారకపోవడం పాలకుల పనితీరుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు..

**- కనీస మౌలిక వసతులు కరువు**
ఉండేందుకు చోటు లేక పని చేసుకునేందుకు ఉపాధి దొరకక అష్ట కష్టాలు పడుతున్న చిన్న దరఖాస్తు గిరిజనులు తమ కాలనీలో కనీస మౌలిక వసతులు సైతం పాలకులు చేపట్టకపోవడం వీరికి శాపంగా మారిందని చెప్పాలి. వీధి కొళాయిలు దగ్గర నుంచి కనీస రహదారి సౌకర్యం లేకపోవడం ముఖ్యంగా రాత్రి సమయంలో చుట్టూ ఉన్న సర్పాల మధ్య చిమ్మ చీకట్లో బ్రతకాల్సిన దుర్భర బతుకులు ఈ గిరిజనులవి. అధికారులు పాలకులు స్పందించి చిన్న దరఖాస్తు గిరిజన కాలనీ వాసులకు ఇంటి స్థలాలు, పక్కా గృహ మంజూరుతో పాటు కనీస మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ఇటు పాలకులు అటు ప్రభుత్వ పెద్దలపై ఉంది.

### గజ, హనుమంత వాహనంపై
# శ్రీరాముడి తేజసం



తిరుపతి, మార్చి 22 ప్రభాతవార్త:
తిరుపతి శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు ఆదివారం ఉదయం 8 గంటలకు స్వామివారు హనుమంత వాహనంపై అభయమిచ్చారు. గజరాజులు, వృషభాలు, అశ్వాలు ముందు కదులుతుండగా, భజన బృందాలు కోలాటాలు ఆడుతుండగా స్వామివారు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించారు. త్రేతాయుగంలో రామభక్తునిగా, భగవద్భక్తులలో అగ్రగణ్యుడుగా ప్రసిద్ధి గాంచిన వాడు హనుంతుడు. హనుమంతుడు తనను సేవించే భక్తులకు ఆత్మోన్నతిని ప్రసాదిస్తు న్నాడు. అనంతరం ఉదయం 10.30 గంటల నుండి శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరాములవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. రాత్రి 7 నుండి 8.30 గంటల వరకు గజ వాహనంపై రాములవారు భక్తులకు కనువిందు చేశారు. వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, డిప్యూటీ ఈఓ నాగరత్న, టెంపుల్ ఇన్‌స్పెక్టం సురేష్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి
### ఇద్దరికి గాయాలు





పూతలపట్టు, మార్చి 22 ప్రభాతవార్త
పూతలపట్టు మండలం పి. కొత్తకోట సమీపంలో ఆదివారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కర్ణాటక రాష్ట్రం మండ్య ప్రాంతానికి చెందిన కుటుంబ సభ్యులు తిరుమల దర్శనానికి వెళ్తుండగా, వారు ప్రయాణిస్తున్న కారు ముందు వెళ్తున్న గుర్తు తెలియని లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతులు సతీష్ (50), భాగ్యలక్ష్మి (45)గా గుర్తించారు. కారులో ప్రయాణిస్తున్న శశాంక్ (23), పవని (10), మహాలక్ష్మి (12), తుషార (4)లకు స్వల్ప గాయాలు కావడంతో సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ వివరాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# 'దేశం' అనుబంధ విభాగాల కార్యవర్గాల ఏర్పాటుపై కసరత్తు

**- ఎమ్మెల్యేలతో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షణ్ముగరెడ్డి సంప్రదింపులు**
**- ఒకొక్క నియోజకవర్గానికి రెండేసీ అనుబంధ విభాగాల అధ్యక్ష పదవులు**

చిత్తూరు, మార్చి 22 ప్రభాతవార్త:
జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి పార్టీ అనుబంధ విభాగాల కార్యవర్గాల ఏర్పాటుపై పార్టీ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరుపుతూ కసరత్తు చేస్తున్నారు. పార్టీ అధిష్టానం ఆమోదంతో ఒక వారం రోజుల్లో జిల్లా తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగాల కార్యవర్గాల ఏర్పాటు చేసే అవకాశం కన్పిస్తోంది. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా 3 నెలల క్రితం నియమితులైన చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరిపి జిల్లా కార్యవర్గం ఏర్పాటు కసరత్తు చేపట్టి పార్టీ అధిష్టానం ఆమోదంతో ప్రకటించారు. ప్రస్తుతం జిల్లా పార్టీకి అనుబంధంగా వున్న విభాగాల కార్యవర్గాల ఏర్పాటుకు జిల్లాలోని పార్టీ ఎమ్మెల్యేలను సంప్రదించి జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అత్యధిక ఎమ్మెల్యేలు పార్టీ అనుబంధ విభాగాల కార్యవర్గాల ఏర్పాటుకు అవసరమైన పేర్లను జిల్లా పార్టీ అధ్యక్షుడికి ఇచ్చినట్లు సమాచారం. జిల్లా పార్టీ అధ్యక్షుడు ఈ పేర్లను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్ళి అధిష్టానం ఆమోదంతో ప్రకటించడానికి సిద్ధమవుతున్నారు. జిల్లా పార్టీకి అనుబంధంగా 17 విభాగాలు వున్నాయి. ఇందులో జిల్లా తెలుగు యువత, జిల్లా తెలుగు మహిళ, జిల్లా తెలుగు రైతు, జిల్లా 'దేశం' ఎస్సీ సెల్, జిల్లా 'దేశం' ఎస్టీ సెల్, జిల్లా 'దేశం' బీసీ సెల్, జిల్లా 'దేశం' మైనార్టీ సెల్, జిల్లా 'దేశం' సాంస్కృతిక విభాగం, జిల్లా 'దేశం' వాణిజ్య విభాగం, జిల్లా తెలుగు విద్యార్థి విభాగం, జిల్లా టిఎన్‌టియు, జిల్లా 'దేశం' డాక్టర్స్ సెల్, జిల్లా 'దేశం' లాయర్స్ సెల్ తదితర విభాగాలు వున్నాయి. జిల్లా పార్టీ అనుబంధ విభాగ అధ్యక్ష పదవులకు సంబంధించి ఒకొక్క అసెంబ్లీ నియోజకవర్గానికి రెండేసీ పదవులు ఇవ్వడానికి జిల్లా పార్టీ అధిష్టానం పక్కాగా కసరత్తు చేస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి జిల్లాలోని పార్టీ ఎమ్మెల్యేలతో పలుమార్లు సంప్రదించపులు జరిపి ఏ నియోజకవర్గంకు పార్టీ అనుబంధ విభాగంలో ఏ అధ్యక్ష పదవి వస్తుందో చెప్పినట్లు తెలిసింది. జిల్లా తెలుగు యువత అధ్యక్షుడిగా పలమనేరుకు చెందిన ఓ యువ పార్టీ నేతకు కట్టబెట్టడానికి సర్వం సిద్ధం అయ్యింది. అలాగే జిల్లా తెలుగు రైతు అధ్యక్ష పదవిని నగరి నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్ నేతను ఎంపిక చేసినట్లు సమాచారం. అలాగే జిల్లా తెలుగు మహిళ అధ్యక్ష పదవికి సంబంధించి ఒకరిద్దరు పోటీ పడుతుండటంతో జిల్లా పార్టీ అధ్యక్షులు పార్టీ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు చేసి ఖరారు చేసే పనిలో నిమగ్నం అయ్యారు. అలాగే ఇతర అనుబంధ విభాగాలకు సైతం అధ్యక్షులను ఎమ్మెల్యేలు ఇచ్చిన జాబితాను మేరకు ఖరారు చేయడానికి సిద్ధమవుతున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు ఇచ్చిన జాబితాలో ఒకటి రెండు మార్పులు చేసి పార్టీ అధిష్టానం ఆమోదం తెలిపితే ఒకటి రెండు రోజుల్లో ఒకొక్క పార్టీ అనుబంధ విభాగ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఇతర కార్యవర్గ సభ్యుల జాబితా వెల్లడి అయ్యే అవకాశం వుంది. అలా కాకుండా నియోజకవర్గాల నుండి పార్టీ నేతల మధ్య పార్టీ పదవుల కోసం పోటీ తీవ్రంగా వుంటే వారితో మరోసారి సంప్రదింపులు జరిపి పేర్లను ఖరారు చేయాల్సివుండటంతో జాబితా బహిర్గం కావడంలో కొంత జాప్యం జరిగే అవకాశం వుంది.

# 3 ఏళ్లలో ఎన్నో చేశాం...30 ఏళ్లు ఏం చేశారు ?
### మాజీ మంత్రి ఆర్.కె.రోజా




పుత్తూరు (నగరి), మార్చి 22 ప్రభాతవార్త :
గత ప్రభుత్వంలో తొలి రెండేళ్లు కరోనా వల్ల వృధా అయిపోగా మిగిలిన మూడేళ్లలో తాము ఎన్నో అభివృద్ధి పనులు చేశామని వైసిపికి చెందిన పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. నగరి నియోజకవర్గంలో తాను కేవలం మూడేళ్లలో పలు అభివృద్ధి చేశానని, 30 ఏళ్లు అధికారంలో వున్న వారు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఆదివారం నగరిలోని తన నివాస కార్యాలయంలో ఇటీవల పదవీకాలం పూర్తి చేసుకున్న పుత్తూరు మునిసిపల్ పాలకవర్గ సభ్యులను ఆమె ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కరోనా కాలంలో తాము ప్రజలకు అండగా నిలిచామన్నారు. పుత్తూరు మునిసిపాలిటీలో తాజ్‌మహల్ లాంటి షాదీమహల్ నిర్మిస్తే తనకు పేరొస్తుందనే దురుద్దేశ్యంతో షాదీమహల్‌ను వినియోగంలోకి తీసుకురాలేదని తెలిపారు. దీనిపై తాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా...ఆయన చీవాట్లు పెట్టినా పట్టించుకోలేదన్నారు. త్వరలోనే ఈ విషయాన్ని మునిసిపాలిటీ గత పాలకవర్గ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకెళతారని తెలిపారు. అలాగే మునిసిపల్ పార్క్, పాలిటెక్నిక్ కాలేజీ, శ్మశానంలో క్రిమేషన్ షెడ్, అర్బన్ హెల్త్ సెంటర్లు, మునిసిపల్ కార్యాలయ భవనం వంటి వివిధ అభివృద్ధి పనులు చేశామని వివరించారు. జగనన్న స్ఫూర్తితో తాను ఈ పనులన్నీ చేయగలిగానని, పెద్ద నాయకులను చెప్పుకునే వారు ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. అవసరం లేని చోట ఓవర్ బ్రిడ్జి నిర్మించి ప్రజలను ఇబ్బంది పెట్టడం తప్ప గత నాయకులు ఏమీ చేయలేదని విమర్శించారు.

**కొండచుట్టు మండపం విషయంలో గాడిదలు కాసింది ఎవరు ?**
నగరి మునిసిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి పనుల్లో కూల్చివేతకు గురవుతున్న కొండచుట్టు మండపాన్ని కాపాడేందుకు తాను ప్రయత్నిస్తుంటే 2023లో గాడిదలు కాస్తున్నారా అంటూ ఎమ్మెల్యే భానుప్రకాశ్ మాట్లాడడంపై ఆమె స్పందిస్తూ...జాతీయ రహదారి నిర్మాణానికి భూసేకరణకు 2008 ఆగస్ట్ నెల 20వ తేదీన టెండరు పిలిచారని తెలిపారు. అయితే రోడ్లు పనులు చేపట్టలేదని, వరుస ప్రమాదాలు జరుగుతుంటే 2023లో తాను ఢిల్లీ వరకూ వెళ్లి ఆగిన పనులు ప్రారంభమయ్యేందుకు కృషి చేశానన్నారు. 2008లో చేసిన సర్వే ఆధారంగా ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. అప్పట్లో నగరిలో ఒక సీనియర్ నాయకుడు, పుత్తూరులో ప్రస్తుత ఎమ్మెల్యే భానుప్రకాశ్ తండ్రి ఎమ్మెల్యేలుగా వున్నారని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే తండ్రి వెంట తిరుగుతూ వుండేవారని, అప్పుడు చేసిన సర్వేలో మండపం పోతుందని ఈ నాయకులు తెలియదా అని ప్రశ్నించారు. 2008లో ఎవరు పాలకులో తెలియని అజ్ఞానంలో ఎమ్మెల్యే వున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని అవాంతరాలు వచ్చినా తాను కొండచుట్టు మండపాన్ని కాపాడుతానని తెలిపారు.

# పేట్రేగి పోతున్న గంజాయి మత్తులో యువత
### ఏం జరిగిందని అడిగినందుకు కిడ్నాప్: హత్యాయత్నం

తొట్టంబేడు,మార్చి 22 ప్రభాతవార్త
శ్రీకాళహస్తిలో యువత మత్తు పదార్థాలకు బానిసలౌతున్నారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి పట్టణం, పరిసరాల్లోని తొట్టంబేడు మండల పరిధిలో కొందరు యువకులు 'గంజాయి'కి బానిసలౌతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి జరిగిన సంఘటన తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. అంతేకాక యువత తీరు ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది. గంజాయి మత్తులు ఆకతాయిలు అదుపు తప్పి దాడులకు పాల్పడటం ' ఏం జరిగిందని ప్రశ్నించిన యువకుని కిడ్నాప్ చేయటం ఆతన్ని హతమార్చటానికి ప్రయత్నించటం పట్టణంలో పరిశీలకులను ఆశ్చర్యానికి గురి చేస్తుంది.
సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి . . .
శ్రీకాళహస్తిలో ఓ ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై తమ ప్రతాపాన్ని చూపారు. గంజాయి మత్తులో ఉన్న ఆ ముగ్గురు ఏం చేస్తున్నారో విచక్షణా జ్ఞానం కొల్పోయారు. శ్రీకాళహస్తి డివైయస్‌పి అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కొత్త పేటకు చెందిన తెలుగుదేశం



4.ఆసుపత్రిలో విచారిస్తున్న సిఐ నాగరాజు

నాయకుడు డైరెక్టర్ కుమారుడు కుమార్ శనివారం రాత్రి శీతలాంబ ఆలయం వద్ద ద్విచక్రవాహనంపై వెళుతుండగా మరో ద్విచక్రవాహనంను వేగంగా నడుపుతూ కుమార్ నడుపుతున్న ద్విచక్రవాహనంను ఢీకొనబోయారు. దాంతో కుమార్ అదుపు తప్పి కింద పడ్డాడు. వాహనం ను వేగంగా నడుపుతూ ఎందుకు జనాన్ని భయభ్రాంతుల్ని చేస్తున్నారని ప్రశ్నించటంతో ముగ్గురు వాగ్వివాదానికి దిగారు. అక్కడే సమీపంలో ఓ బ్రోకర్ ఆఫీస్ వద్ద నిలబడి ఉన్న తెలుగుయువత నాయకులు బాల,రాకేష్,తన స్నేహితుని కుమారుడైన కుమార్‌ను ము గ్గురు చుట్టుముట్టి దురుసుగా ప్రవర్తించటం గమనించారు. వంటనే వారిద్దరు మత్తులో శృతిమించుతున్న ముగ్గురిని నిలదీసారు. దాంతో ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దాంతో ప్రశ్నించిన వారిలో బాలను తమ వాహనంపై ఎక్కించుకొని సుమారు ౦రెండు కిలో మీటర్లు తీసుకెళ్ళినట్లు పోలీసులకు బాల ఇచ్చిన ఫిర్యాదులో ఉందని తెలిపారు. బాలను తీసుకెళ్ళి న యువకులు రాడ్‌లతోనూ, మద్యం బాటిళ్ళతో పాశవికంగా దాడి చేసి రక్త గాయాలు చేసారు. తలపై బలంగా రాడ్‌తో కొట్టినట్లు గాయమైంది. దాంతో తెలుగుదేశం శ్రేణులు బాలాను వెతుక్కుంటూ సంఘటనా స్థలానికి చేరుకోవటంతో ముగ్గురు పరారయ్యారు. గాయపడిన బాలను రాకేష్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘనకు సంబంధించి విషయం తెలిసిన వెంటనే టూటౌన్ సిఐ నాగరాజు వారి సిబ్బంది ఆసుపత్రికి చేరుకొని బాల వాంగ్మూలం మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు. డివైయస్‌పి నరసింహామూర్తి ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించారు. నిందితుల కోసం టౌటౌన్ పోలీసులు వెతుకుతున్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## -ఎంపీ దగ్గుమళ్ళ,ఎమ్మెల్యే మురళీమోహన్‌లు



కాణిపాకం, మార్చి 22 ప్రభాతవార్త: ప్రజల అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్‌లు అన్నారు. ఐరాల మండలం బొమ్మసముద్రం గ్రామపం చాయతీ గ్రామ పంచాయతీలో సుమారు 1.50 కోట్లు రూపాయల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌లతో కలసి ప్రారంభించారు. ఈమేరకు బొమ్మసముద్రం పంచాయతీ పరిధిలోని తిమ్మోజిపల్లె బొమ్మసముద్రం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్లు, చెరువు మొరవ కల్వర్టుల మరమ్మత్తులు, ఆరోగ్యకే ంద్రం, ఎంపీపీ పాఠశాల భవనం, సీసీ రోడ్లు, బొమ్మసముద్రం ఎస్సీ వాడలో కమ్యూనిటీ హాల్‌లను ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధితో గ్రామాలు పరుగులు పెడుతున్నాయని తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అభివృద్ధి పనులన్నీ పూర్తికావడంతో బొమ్మసముద్రం గ్రామ పంచాయతీ ఓ మోడల్ పంచాయతీగా...పచ్చదనానికి మారుపేరుగా రూపాంతరం చెందడం ఆనందంగా వుందన్నారు. ఏప్రభుత్వం చేయలేని అభివృద్ధిని తమ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. బొమ్మసముద్రం పంచాయతీ పర్యటనకు విచ్చేసిన ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌లకు కాణిపాకం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ వి.మణి నాయుడు, సర్పంచ్ రఘు,బొమ్మసముద్రం యూత్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు హరిబాబునాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి, మాజీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, జడ్పీటీసీ సుచిత్ర, మాజీ జడ్పీటీసీ ఎం.లత,బంగారుపాళ్యం ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, సీనియర్ నాయకులు గిరిధర్‌బాబు,మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర చౌదరి, మొరార్జియాదవ్, ధరణీప్రసాద్, నాయకులు మధుసూధన్‌రావు, చొప్పానాని, శేషాద్రినాయుడు, జయచంద్ర నాయుడు,ఎల్.మోహన్‌బాబు, పవన్‌కుమార్, నవీన్ కుమార్, నరసింహులునాయుడులతో పాటు పలువురు నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరుహెల్త్, మార్చి 22 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ తుషార్ డూడి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని వారు పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారు.

## కేంద్రీయ విద్యాలయలో ప్రవేశాలకు దరఖాస్తులు

కుప్పం, మార్చి 22 ప్రభాతవార్త

కుప్పంలో 2026-27విద్యా సంవత్సరంలో ప్రారంభం అవుతున్న కేంద్రీయ విద్యాలయలో ప్రవేశాలకు గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిని ్సపాల్ దివాకర్ తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో ద్రవిడ వర్సిటీలోని పెరియార్ భవన్‌లో తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. బాలవాణిక 1,2,3 మరియు మొదటి తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రెండో తరగతి ఆపై తరగతులకు విద్యాలయలో ఆఫ్‌లైన్‌లో ప్రవేశ నమోదు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు9476007488నెంబరు లేదా కేంద్రీయ విద్యాలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## ఘనంగా షహీద్ దివస్ పాదయాత్ర

కుప్పం, మార్చి 22 ప్రభాతవార్త



దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పిస్తూ ఆదివారం కుప్పంలో షహీద్ దివస్ పాదయాత్ర కార్యక్రమంను బిజెపి ఇన్‌చార్జ్ తులసినాథ్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తి, ఐక్యత, జాతీయ బాధ్యత భావాలు పెంపొందించేలా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. నా భారత్ - నా బాధ్యత అనే నినాదంతో ఈ పాదయాత్ర చేపట్టామన్నారు. ఈసందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టి బస్టాండు ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమాల్లో పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, కాణిపాకం డైరెక్టర్ నరేష్, లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, మండల బిజెపి అధ్యక్షులు వడివేలు, రామచంద్ర, గంగమ్మ గుడి డైరెక్టర్ జయరాంనాయుడు, పరంధామ, గోపి, గణేష్, గోవింద్, రుణి, యువ భారత్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

పెద్దపంజాణి, మార్చి 22 ప్రభాతవార్త



వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై మారెప్ప హెచ్చరించారు. ఆదివారం వాహనదారులకు రోడ్డు భద్రత, హెల్మెట్ ధారణలపై అవగాహన కల్పించారు. టువీలర్ నడిపేవారు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే మైనర్ల చేతికి వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రజలు కూడా నిబంధనలు పాటించి సహకరించాలని కోరారు.

## విజయవాడలో రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాన్ని అందుకున్న సుదర్శన్ శర్మ..

రైల్వేకోడూరు రూరల్, మార్చి 22 ప్రభాతవార్త



ఆదివారం విజయవాడలో ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కే సతీష్ శర్మ రైల్వే కోడూరు శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త డాక్టర్ సుదర్శన్ శర్మకు రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాన్ని అందజేశారు. శర్మ నిర్వహించిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేసినట్లు సతీష్ శర్మ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ రాష్ట్ర నాయకులు ద్రాక్షాయని, సి ఆర్ కే శేషగిరిరావు, ఏ ఎల్ ఎన్ శాస్త్రి, మురళి తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో బిర్యానీ భోజనాలు

పలమనేరు, మార్చి 22, ప్రభాతవార్త:




పలమనేరు ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వివిధ రంగాల అధికారులు, కార్మికులకు బిర్యానీ భోజనాలు వడ్డించారు. శనివారం రంజాన్ పండుగ కావడంతో కొంత మంది హిందువులు మాంసాహారం తినరు. దీంతో ఈ కార్యక్రమం ఆదివారం ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమీషనర్ ఎంవిరమణారెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి మమతారాణి ఆసుపత్రి సిబ్బంది, మున్సిపల్ అధికారులు, పారిశుద్యం కార్మికులు, శ్మశాన వాటక కార్మికులు హాజరయ్యారు. కార్మికులందరికీ బట్టలు కూడా పంపిణీ చేశారు. కమీషనర్ మాట్లాడుతూ ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఇంత మందికి బిర్యానీ భోజనాలు అందజేసి బట్టలు పంపిణీ చేయడం సంతోష దాయకమన్నారు. కమిటీ ఛైర్మన్ జిలానీ మాట్లాడుతూ కార్మికులు ప్రజలకు చేస్తున్న సేవలకు గుర్తుగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని వేరే ఉద్దేశంలేదని తెలిపారు.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, మార్చి 22 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం లో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు ఆదివారం లక్ష రూపా యలను విరాళంగా అందజేశారు. ఈమేరకు నంద్యాల జిల్లా నందికొట్కూరుకు చెందిన రాజశేఖర్‌బాబు అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవిలకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## 25న అరగొండ పంచాయతీలో బహిరంగ వేలం పాటలు

తవణంపల్లె, మార్చి 22 ప్రభాతవార్త:

మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అరగొండలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి వివిధ లీజు హక్కుల కోసం ఈనెల 25న బహిరంగ వేలం పాటలను నిర్వహించనున్నట్లు పంచాయతీ సర్పంచ్ మల్లుదొరై, గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి ఎం.సురేష్‌బాబులు తెలిపారు. ఈమేరకు గ్రామ సచివాలయ కార్యాలయంలో డివిజినల్ పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటలకు దినసరి మార్కెట్, వారపుసంత, గ్రామపంచాయతీ కాంప్లెక్స్‌లో ఆరు దుకాణాలకు సంభందించి లీజు హక్కుల కోసం బహిరంగ వేలం పాటలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు నిర్ణీత రుసుమును ధరావత్తుగా చెల్లించి పంచాయతీ నియమ నిబంధనల మేరకు బహిరంగ వేలంలో పాల్గొన వచ్చునని వారు తెలిపారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరుహెల్త్, మార్చి 22 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు హాజరు కావాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించి సమస్యలను సత్వరం పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సైతం సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు విధిగా హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటిని సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

## కేంద్రీయ విద్యాలయాల్లో నేటి నుండి అడ్మిషన్ల ప్రక్రియ

- కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, మార్చి 22 ప్రభాతవార్త: చిత్తూరు, కుప్పంల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో సోమవారం నుండి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు ఇరువారం దగ్గర తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయం, కుప్పం ద్రవిడ యూనివర్సిటీలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయంలో ఈ అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. మార్చి 23 నుండి పాఠశాలలు ప్రారంభం కానుండటంతో జిల్లాలోని రెండు కేంద్రీయ విద్యాలయాల్లో ఈ నెలాఖరు నాటికి సదుపాయాల కల్పన పూర్తి చేస్తామన్నారు. ఈ క్రమంలో ఇక్కడ ఇంగ్లీషు, హిందీ, మ్యాథ్స్, ఎకనామిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కామర్స్, పిజీటి, టిజీటి, ప్రైమరీ టీచర్ల పోస్టులు భర్తీ చేయనున్నారన్నారు. అలాగే పిజీటి కంప్యూటర్ సైన్స్, ఇన్‌స్ట్రక్టర్, డాన్స్ కోచ్, యోగా ఇన్‌స్ట్రక్టర్, లేదా స్టాఫ్‌నర్స్, ఎడ్యుకేషన్ కౌన్సిలర్, స్పెషల్ ఎడ్యుకేషన్, తెలుగు ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు. 2026-27 విద్యాసంవత్సరానికి కేంద్రీయ విద్యాలయాల్లో 1వ తరగతి(ఎంపిక చేసిన పాఠశాలలు)ల్లో ప్రవేశం కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు మార్చి 23 ఉదయం 10 గంటల నుండి ఏప్రిల్ 2 మధ్యాహ్నం 2 గంటల వరకు చేసుకోవచ్చునన్నారు. 1వ తరగతి ప్రవేశానికి కనీస వయస్సు 6 సంవత్సరాలని, అడ్మిషన్ నెం.2026-27 మార్గదర్శకాల ప్రకారం తరగతుల్లో సీట్లు రిజర్వేషన్ చేయబడుతుందన్నారు. వివరాలకు చిత్తూరు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ లూథర్ ఫోన్:89198 20152, కుప్పం కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ దివాకర్ ఫోన్: 94760 07488 నెంబర్లను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చునన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## పక్కాగా 2027 జనగణన

- జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్

చిత్తూరు, మార్చి 22 ప్రభాతవార్త: జిల్లాలో 2027 జనగణన కార్యక్రమంను పక్కాగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ అన్నారు. జిల్లాలో జనగణన కార్యక్రమంను సమర్థవంతంగా నిర్వహించడానికి ఫీల్డ్ స్థాయిలో జరిగే శిక్షణా కార్యక్రమాలకు అధికారులు కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు. జనగణన కార్యక్రమాలపై ఆదివారం డిఆర్‌ఓ మోహన్‌కుమార్ అధికారులకు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు జారీ చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఓ మాట్లాడుతూ ఇప్పటికే జనగణనకు సంబంధించి రాష్ట్ర, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ పూర్తయ్యిందన్నారు. రాష్ట్ర స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇఆర్‌ఓలు, మున్సిపల్ కమీషనర్లకు విజయవాడలో శిక్షణ జరిగిందని, అలాగే ప్రతి జిల్లాకు ఇద్దరు చొప్పున ఎంపిక చేసిన మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా స్థాయిలో తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఎఎస్‌ఓలు, డిజిటల్ అసిస్టెంట్లకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఇప్పటికే నిర్వహించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ దశలో ఫీల్డ్ ట్రైనర్లకు శిక్షణ ఇవ్వాల్సి వుంటుందన్నారు. ఫీల్డ్ ట్రైనర్లు ప్రధానంగా స్కూల్ అసిస్టెంట్లు, హెడ్‌మాస్టర్లు కాగా వీరు ఆపై మండలాల్లో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇవ్వాల్సి వుంటుందన్నారు. అలాగే ఫీల్డ్ ట్రైనర్ల శిక్షణ రెండు బ్యాచుల్లో నిర్వహించడం జరుగుతుందని, మొదటి బ్యాచ్ 23, 24, 25 తేదీల్లో కుప్పం, పలమనేరు, నగరి డివిజన్లకు చెందిన 34 మంది ట్రైనర్లు ఈ శిక్షణలో పాల్గొంటారని, 26, 28, 29 తేదీల్లో రెండవ బ్యాచ్‌లో చిత్తూరు డివిజన్‌కు చెందిన ట్రైనర్లు పాల్గొంటారన్నారు.

## ప్రభుత్వ స్థలాలలో బోర్డులు

బైరెడ్డిపల్లి, మార్చి 21 ప్రభాతవార్త



బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని పాతచావిడికి సంబంధించిన స్థలాన్ని,పోలీస్ కోటర్స్ కు కేటాయించిన స్థలాన్ని,కొందరు ఆక్రమించుకుంటారనే నెపంతో మండల తహసిల్దార్ ఎం ఎస్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యం లో ప్రభుత్వానికి సంబంధించిన స్థలంగా బోర్డును తగిలించడం అయినది. చావడికి సంబంధించిన స్థలం అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ స్థలంగా గుర్తించిందని దాన్ని కాపాడుకునే క్రమంలో బోర్డును వేయవలసి వచ్చిందని ఈ సందర్భంగా తహసిల్దార్ తెలియజేశారు.పోలీస్ క్వార్టర్స్ నిర్మించడానికి కేటాయించిన 15 సెంట్లు స్థలానికి చుట్టూ గోడ నిర్మించనున్నట్లు సబ్ ఇన్స్పెక్టర్ చందన ప్రియ తెలియ జేశారు. మండలంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఎం ఆర్ ఓ ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ చందన ప్రియ,ఆర్ఐ దాము, వీఆర్వో రాజేష్,గురువిరెడ్డి, ప్రసాద్,జై రాం తదితర రెవిన్యూ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఉచిత కంటి పరీక్షలు

రామకుప్పం,మార్చి 22 ప్రభాతవార్త



కుప్పం పిఇఎస్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో సోమవారం సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వ హిస్తున్నట్లు వీఆర్‌ఏ వెంకటేష్ తెలిపారు. మండలంలోని కంటి రోగులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటి పరీక్షలు వచ్చేవారు ఆధార్ కార్డు ఫోన్ నెంబర్ తీసుకురావాలన్నారు. అధిక కంటి వ్యాధిగ్రస్తులను ఎంపిక చేసి శాస్త్ర చికిత్సలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని కంటి రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన స్థానిక నేతలు

రామకుప్పం, మార్చి 22 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం వద్ద శాశ్వత అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులను టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి నేతలతో కలిసి పరిశీలించారు. త్వరి తగితన పనులు పూర్తి చేసి నిరుపదులకు ఐదు రూపాయలకే టిఫన్, భోజనం అన్న క్యాంటీన్ సిద్ధమవుతుందన్నారు. దివంగత నేత ఎన్టీఆర్ ఆశయాలు కనుగుణంగా నిరుపేదలకు పట్టెడు అన్నం పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం మణీంద్రం మినీ పార్క్ ను పరిశీలించి నారా భువనేశ్వరి పర్యటనలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తు న్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి అరుణ జ్ఞాన శేఖర్ రెడ్డి, గణేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## నారా భువనేశ్వరి పర్యటన జయప్రదం చేయాలి

రామకుప్పం, మార్చి 22 ప్రభాతవార్త

సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఈనెల 26న రామకుప్పంలో పర్యటనను విజయవంతం చేయాలని గ్రంధాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి, టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ పేర్కొన్నారు. ఆదివారం సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద నేతలు, కార్యకర్తలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సర్కిల్ వద్ద దివంగత నేత ఎన్టీ రామారావు కాంస్య విగ్రహాన్ని ప్రారంభించనున్నారు. శ్రీరామనవమి పండుగతో కాశీ విశ్వేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు భాగంగా ఆలయంలో పూజలో పాల్గొంటారు. మణీంద్రం గ్రామంలో మినీ పార్కును ప్రారంభిస్తారు అన్నారు. బల్ల గ్రామంలో మహిళలతో ముఖాముఖి సమావేశ మవుతారు. ఈ కార్యక్రమాలకు మండలంలోని కూటమి నాయకులు ,కార్యకర్తలు మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, నారాయణ చారి, సీతాపతి, రామ్మూర్తి, చిన్నకృష్ణ, చలపతి, కామరాజు నాయక్, రామకృష్ణప్ప,రవిరెడ్డి,అవినాష్,బాలరాజు,సుబ్రి, ఆదిల్, మంజునాథ్, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పలమనేరు శాఖాగ్రంథాలయం తనిఖీ



పలమనేరు, మార్చి 22, ప్రభాతవార్త: ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి పలమనేరు శాఖా గ్రంథాలయాన్ని ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయంలో వున్నాయని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశం వినియో గించుకొని పరీక్షల్లో ఉత్తీర్ణులై వివిధ ప్రభుత్వ రంగాల్లో స్థిరపడాలని సూచిం చారు. ప్రతి విద్యార్థి పాఠ్య పుస్తకాలతో పాటు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు కూడా చదవాలని అవి గ్రంథాలయాల్లో మాత్రమే లభిస్తాయని తెలిపారు.

## వ్యాసరచన పోటీలో కల్లాడు విద్యార్థి ప్రతిభ

పలమనేరు, మార్చి 22 ప్రభాతవార్త:



తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఉగాది పండుగ సందర్భంగా పలమనేరులో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పలమనేరు మండలం కొలమాసనపల్లె పంచాయితీ దిగువ కల్లాడు ప్రైమరీ పాఠశాలకు చెందిన ఎల్.వెంకటేష్ ప్రథమ బహుమతి సాధించాడు. విద్యార్థికి సమితి అధ్యక్షుడు తులసినాథంనాయుడు బహుమతి అందజేయగా పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామపెద్దలు అభినందించారు.

# ఎన్నో ఏళ్ళ కల ఈ నాటికి సాకారం





**విజయపురం, మార్చి 22 ప్రభాతవార్త:**

మండలంలోని పలు గ్రామీణ రోడ్లు ఏళ్ళ తరబడి మట్టి రోడ్లుగా గుంతలమయమై రాకపోకలకు వాహనదారులు, సాధారణ ప్రజలు ఇబ్బందులు పడేవారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు అధికారానికి వచ్చిపోయాయి. అంతేకాకుండా ఈ నియోజకవర్గంలో ఇద్దరు మంత్రులుగా కూడా పనిచేశారు. ఈ రోడ్ల దుస్థితి అలాగే వదిలేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చరవతో మండలంలోని పలు మట్టి రోడ్లను తారు రోడ్లుగా మార్చేందుకు సుమారు 8 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు చేయించి త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేయించారు. ఇందులో భాగంగా కోసలనగరం మిట్టూరు, శ్రీహరిపురం, లక్ష్మీవిలాసపురం, పాతార్కాడు, గొల్లపల్లి, సూరికాపురం, సీఎన్ కండ్రిగ, వరదరాజుల కండ్రిగ, గాండ్ల కండ్రిగ గ్రామాలకు మట్టి రోడ్లు తారు రోడ్లుగా రూపాంతం చెందేందుకు త్వరితగతిన పూర్తి చేసేందుకు స్థానిక మండల నాయకులు రమేష్‌రాజు, బాలసుబ్రహ్మణ్యంరాజు, బాబు యాదవ్, మునిభాస్కర్‌రాజు, దశరథరాజు, సమరసింహారెడ్డి, రమణయ్య యాదవ్, బీజేపీ నాయకుడు కైలాసం యాదవ్, తదితరులు సంబంధిత ఇంజనీర్లకు సహకరించారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యే కృషి, పట్టుదలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆప్యాయతను పంచుతూ.. వృద్ధులతో ప్రేరణ సభ్యుల అవుటింగ్

**తిరుపతి విద్య మార్చి 22 ప్రభాతవార్త**



యువతలో సేవా దృక్పథాన్ని చాటుతూ ప్రేరణ హెల్పింగ్ సొసైటీ సభ్యులు వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదర్శ నిలయం వృద్ధాశ్రమానికి చెందిన 45 మంది వృద్ధులతో కలిసి "ఫార్మ్ హౌస్ డే అవుటింగ్ అండ్ పోట్లక్" కార్యక్రమాన్ని తనపల్లి మామిడి తోటలో ఆదివారం నిర్వహించారు. తిరుపతికి చెందిన యువతతో ఏర్పడిన ఈ సంస్థ, వృద్ధులకు ప్రకృతి మధ్యలో సంతోషంగా గడిపే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రేరణ సభ్యులు తమ ఇళ్లలో తయారు చేసిన వంటకాలతో ప్రత్యేక పోట్లక్ భోజనం ఏర్పాటు చేసి, వృద్ధులతో కలిసి భోజనం పంచుకున్నారు. ఈ సందర్భంగా యువత-వృద్ధుల మధ్య ఆప్యాయతా బంధం మరింత బలపడింది. అనంతరం నిర్వహించిన ఆటలు, వినోద కార్యక్రమాలు వృద్ధులకు ఆనందాన్ని పంచగా, యువతలో సేవా స్ఫూర్తిని మరింత పెంపొందించాయి. ఈ కార్యక్రమంలో ప్రేరణ సభ్యులు, వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని, సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ప్రేరణ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ బలరామ్, సౌందర్యలతో పాటు ఇతర సభ్యులు మరియు వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని, సమాజానికి ఆదర్శంగా నిలిచారు.

## గరికపాటి వ్యాఖ్యలపై ఏఐఎస్ఎఫ్ ఆగ్రహం

**తిరుపతి విద్య మార్చి 22 ప్రభాతవార్త**



గరికపాటి చేసిన "చదవాలంటే చదవండి, లేకపోతే వెళ్లిపోండి" వ్యాఖ్యలపై ఏఐఎస్ఎఫ్ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. ఆకలి కడుపుతో ఉన్న పిల్లలకు చదువు సాధ్యం కాదని, మధ్యాహ్న భోజనం వారి హక్కు అని స్పష్టం చేశారు. ఆర్టికల్ 21 ప్రకారం పౌష్టికాహారం కూడా జీవన హక్కులో భాగమని తెలిపారు. 2001 సుప్రీంకోర్టు తీర్పును గుర్తుచేస్తూ, పాఠశాలల్లో వండిన భోజనం అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. దేశంలో పోషకాహార లోపం ఇంకా కొనసాగుతుండటం ఆందోళనకరమని, పిల్లల సంక్షేమంపై దృష్టి పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. గరికపాటి తన వ్యాఖ్యలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## తిరుపతిలో మెగా కంటి వైద్య శిబిరం




**తిరుపతి విద్య, మార్చి 22 ప్రభాతవార్త**

తిరుపతి పట్టణంలోని విశ్వం ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్‌లో ఆదివారం మెగా కంటి వైద్య శిబిరం మరియు రక్తదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎం.వి.రావు ఫౌండేషన్, ఆర్తల అల్లయ్య చారిటబుల్ ట్రస్ట్, ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించాయి. కార్యక్రమానికి విశ్వచందన్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. శిబిరంలో భాగంగా వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఆపరేషన్ల కోసం తరలించారు. అలాగే దృష్టిలోపం ఉన్నవారికి కంటి అద్దాలు అందించారు. గూడూరు మెడిపల్స్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదానం నిర్వహించారు. విద్యార్థులకు హోమియో మందులు పంపిణీ చేయగా, స్థానిక ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమం విజయవంతం కావడంతో నిర్వాహకులను పలువురు అభినందించారు.

## క్రికెట్ మ్యాచ్ లో కష్టపడి గెలిచిన పోలీస్ టీం....

### పోరాడి ఓడిన విలేకరుల టీం

**రేణిగుంట మార్చి 22 ప్రభాతవార్త**



రేణిగుంట (తిరుపతి) సి ఆర్ ఎస్ గ్రౌండ్ నందు ఆదివారం ఉదయం జరిగిన టి15 క్రికెట్ మ్యాచ్ నందు విలేకరుల జట్టుపై పోలీస్ జట్టు విజయం సాధించి విన్నర్ కప్పు అందుకున్నారు. నిర్ణీత 15 ఓవర్లలో జర్నలిస్టులో జట్టు మూడు వికెట్ల నష్టంతో 110 పరుగులు సాధించి గెలుపుకు 111 పరుగుల లక్ష్యాన్ని పోలీస్ టీం ముందు ఉంచింది. పోలీసు జట్టు ప్రారంభంలో వికెట్లు వరుసుగా కోల్పోయింది. దీంతో పోలీస్ టీమ్ కెప్టెన్ సీఐ జయచంద్ర ఆటగాళ్లను ప్రోత్సహించి అద్భుతమైన ప్రణాళికలు రూపొందించి 14.1 ఓవర్లలో 7 కోల్పోయి 112 పరుగులు చేసి కప్పును చేతికిచ్చుకుంది. పోలీస్ జట్టు తరఫున సురేష్ స్టాండ్ ఇచ్చి టీమును గెలిపించాడు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గా సురేష్ షీల్డ్ అందుకున్నారు. జర్నలిస్ట్ తరఫున నాగేంద్ర (బిన్నీ) అద్భుతమైన షాట్లు కొట్టి 61 పరుగులు సాధించి బెస్ట్ బ్యాట్స్మన్, కీలక వికెట్లు పడగొట్టి నిషార్ అహ్మద్ బెస్ట్ బౌలర్ గా డీఎస్పీ శ్రీనివాసరావు చేతుల షీల్డ్ లు అందుకున్నారు. మ్యాచ్ రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు, పుత్తూరు డీఎస్పీ రవికుమార్ పరివేక్షణలో దిగ్విజయంతంగా నిర్వహించారు.

## మధ్యాహ్నం భోజనం కార్మికులకు స్కూలు స్లీపర్స్‌లకు కనీస వేతనం ఇవ్వాలి

**పుత్తూరు రూరల్, మార్చి 22 ప్రభాతవార్త:**



పుత్తూరు డివిజన్ సమితి ఏఐటీయూసీ పుత్తూరు డివిజన్ అధ్యక్షుడు గోపి అధ్యక్షతన డివిజన్ పరిధిలో ఉన్న మధ్యాహ్నం భోజనం కార్మికులు, స్కూళ్ళలో పని చేస్తున్న స్లీపర్స్‌లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ డివిజన్‌కార్యదర్శి చంద్రబాబు మాట్లాడుతూ స్కూల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు స్లీపర్స్‌కు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని రాజకీయ వేధింపులు మానుకోవాలని తెలిపారు. వంట గ్యాసులు ఉచితంగా ఇవ్వాలని విద్యార్థులకు మేనేజ్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. 3 వేలు మాత్రమే ఇస్తున్నారని అది చాలడం లేదని కార్మికుల వద్ద చాకిరి చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజన కార్మికులకు యూనిఫాం ఇవ్వాలని, స్కూలు స్లీపర్స్‌లకు గుర్తింపు కార్డులు, యూనిఫాంలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మహేష్, రమణ, కృష్ణారెడ్డి, కైలాసం, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థులు చలివేంద్రం ఏర్పాటు

**పుత్తూరు రూరల్, మార్చి 22 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణంలోనే 1990-1991 బ్యాచి 10వ తరగతి పూర్వ విద్యార్థులు స్థానిక కార్వేటినగరం రోడ్డులో వేసవి తాపానికి ఆదివారం చలివేంద్రం, మినరల్ వాటర్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వృద్ధులు, మహిళలు, వారి ప్రయాణం నిమిత్తం వెళ్లేటప్పుడు నీరు తాగాలని ఉన్నప్పుడు, ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తే మంచిదని పూర్వ విద్యార్థులు న్నారు.

## అనంతరాజుపేట రంజాన్ వేడుకలో రామిరెడ్డి ధ్వజరెడ్డి

**రైల్వేకోడూరు రూరల్, మార్చి 22 ప్రభాతవార్త**



రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట మైనార్టీ నాయకులు ఎస్ఏ సలాం తనయుడు షఫీ ఏర్పాటు చేసిన చిన్నపాటి రంజాన్ వేడుకల్లో రైల్వే కోడూరు కు చెందిన వైసిపి సీనియర్ నాయకులు మండల ఉపాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు మండలంలో అనంతరాజుపేట మైనార్టీ వర్గీయులు రంజాన్ సందర్భంగా ప్రతి ఏటా ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేస్తారని, ఆయన ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరుకు చెందిన వైసీపీ క్యాడర్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. రానున్న రోజుల్లో వైసీపీ పార్టీని బలోపేతం చేసేందుకు సాయి శక్తుల కృషి చేస్తానని షఫీ రామిరెడ్డి ధ్వజ రెడ్డికి తెలియజేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి ధ్వజ రెడ్డిని, కోడూరు ఉప సర్పంచ్ తోట శివ సాయిలను మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సర్పంచులు నాయిని హరికృష్ణ రెడ్డి, దొమ్మరాజు సుబ్రహ్మణ్యం రాజు, ఆర్ వి రమణ, ఆనాల చెంగల్ రెడ్డి, రామిరెడ్డి ఓబుల్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి యాదవ్ సంఘం నాయకులు కౌ రెడ్డి సిద్దయ్య, దార్ల చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, బత్తల సుబ్రహ్మణ్యం, బత్తలమని తదితరులు పాల్గొన్నారు.

## భరతనాట్య కళాకారుడు శరత్ చంద్రకు కళారత్న అవార్డు

**తిరుపతి కలెక్టరేట్, మార్చి 22 ప్రభాతవార్త**




ప్రతి సంవత్సరం కె సి పుల్లయ్య వర్ధంతి సందర్భంగా విద్యా, క్రీడా, సాంస్కృతిక, అగ్రికల్చర్ రంగాలలో నిష్ణాతులైన వారికి కెసి పుల్లయ్య నేషనల్ ఫౌండేషన్ వారు పురస్కారాలను అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది సాంస్కృతిక రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన తిరుపతికి చెందిన భరతనాట్య నృత్య కళాకారుడు డాక్టర్ పి శరత్ చంద్రను కె సి పుల్లయ్య నేషనల్ కళా రత్న అవార్డు వరించింది. హైదరాబాద్‌లో ఆదివారం కేంద్ర భారీ పరిశ్రమలు , ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, తెలంగాణ ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీ డాక్టర్ కె లక్ష్మణ్ చేతుల మీదుగా శరత్ చంద్ర ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. భరతనాట్య రంగంలో ఆయన చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ప్రముఖులు కొనియాడారు

## నేడు జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**తిరుపతి కలెక్టరేట్, మార్చి 22 ప్రభాతవార్త :**



తిరుపతి జిల్లా కలెక్టరేట్ లో నేడు సోమవారం ప్రజా సమస్య ల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదివారం తెలిపారు. అర్జీదా రులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపో యినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవ చ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చ న్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు..

## శ్రీసిటీ-డానియెలి పరిశ్రమను సీఐఐ గోల్డ్ అవార్డు

**సత్యవేడు, మార్చి 22 ప్రభాతవార్త:**




శ్రీసిటీలోని ప్రముఖ ఉక్కు, లోహ పరికరాల తయారీ సంస్థ డానియెలి ఇండియా లిమిటెడ్, సీఐఐ ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ ఎక్సలెన్స్ అవార్డు-2025లో ఇంజనీరింగ్ విభాగంలో గోల్డ్ అవార్డును గెలుచుకుంది. విశాఖపట్నంలో శనివారం జరిగిన వేడుకల్లో ఈ అవార్డు ప్రదానం చేశారు. సంస్థ అమలు చేస్తున్న ఉత్తమ భద్రతా ప్రమాణాలు, పని సంస్కృతికి ఈ అవార్డు దక్కింది. సీఐఐ, పరిశ్రమ నిపుణులు నిర్వహించిన సమగ్ర సర్వే ఆధారంగా అవార్డుకు ఎంపిక చేశారు. అవార్డు స్వీకరించిన డానియెలి ఇండియా సీవోవో పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ అవార్డు ప్రపంచ స్థాయి భద్రతా ప్రమాణాలపై తమ కంపెనీ నిబద్ధతను ప్రతిభింబిస్తుందన్నారు. డానియెలి సంస్థను అభినందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఈ గౌరవం శ్రీసిటీని భద్రత, నాణ్యతా పారిశ్రామిక పద్ధతుల కేంద్రంగా మరింత బలపరుస్తోందని పేర్కొన్నారు.

## మండల వైసీపీ అధ్యక్షుని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**రేణిగుంట, మార్చి 22 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదివారం రేణిగుంట మండల వైసీపీ పార్టీ అధ్యక్షుడు గంగారి రమేష్ ను గాజులమండ్యంలో ఆయన ఇంటి వద్ద పరామర్శించారు. ఇటీవల గంగారి రమేష్ ఆరోగ్యపరమైన సమస్యతో శస్త్ర చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. తమ పార్టీ కుటుంబ సభ్యుని ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవడానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆయన నివాసానికి చేరుకొని పరామర్శించి యోగ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షి ంచారు. వైసిపి కుటుంబ సభ్యులకు పార్టీ అండ ఉంటుందని తెలిపారు. పరామర్శించిన వారిలో శ్రీకాళహస్తికి చెందిన వైసిపి నేతలు, రేణిగుంట మండలానికి చెందిన జువ్వల దయాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మధుసూదన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ 2026 డైరీలను ఆవిష్కరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముదిరాజులంతా ఐక్యమత్యంగా వైసిపికి మద్దతుగా ఉండి గెలిపించాలని కోరారు. డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు గంగారి రమేష్, ముద్ద రాయల్, సునీల్ కుమార్, శివకుమార్, ప్రకాష్, శ్రీనివాసులు, తేజ, హేమంత్, అయ్యప్ప, ధనుంజయులు, మునికృష్ణ, దశరథ, లక్ష్మణ్, బీమా, గణేష్, మోహన్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# 27న సీతారాముల కళ్యాణోత్సవం



**శ్రీకాళహస్తి, మార్చి 22 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న సీతారాముల కళ్యాణాన్నిఈ నెల 27 ననిర్వహించుటకు అర్చకులు నిర్ణయించినట్లు ఆలయ ఇఓ బికె వెంకటేశు ఆదివారం తెలిపారు. ఇక్కడ ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. దాంతో గత నెహ్రూవీధిలో నిర్మించిన ఆలయంలో మొదటి సారి భక్తులందరి కోసం కళ్యాణ వేదికను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దనున్నట్లు ఇఓ వివరించారు. పట్టాభిరామస్వామి ఆలయంలో నిర్వహించే నవమి ఏర్పాట్లను ఇఇ శ్రీనివాసులు రెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. నవమి రోజు దేవస్థానం తరఫున సీతారాముల కళ్యాణం నిర్వహించాల్సి ఉండటంతో కళ్యాణ నిర్వహణపై సమాలోచనలు జరిపినట్లు వివరించారు. గతంలో ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో కళ్యాణోత్సవం నిర్వహించే వారని అయితే నెహ్రూవీధిలో పట్టాభిరామస్వామి ఆలయం లో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఈ నెల 27న నిర్వహించే సీతారాముల కళ్యాణానికి ఇఓ పోలీసు అధికారులతో చర్చించారు. నెహ్రూరోడ్డులో భక్తులందరు సీతారాముల కళ్యాణాన్ని వీక్షించే విధంగా కళ్యాణవేదికను ఏర్పాటు చేస్తున్నామని ఆరోజు ట్రాఫిక్‌కు సంబంధించి చర్చించారు. దేవస్థానం బహిరంగంగా నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి ఆలయ ఇఓ ఇఇలు పోలీసులతో చర్చించామన్నారు. ఇక్కడ తూర్పు వైపు కళ్యాణ వేదికను ఏర్పాటు చేసి పెండ్లి మండపం వరకు భక్తులు కూర్చొనేందుకు వీలుగా జర్మని షెడ్లను ఏర్పాట్లు చేయాలని ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంజనీరింగ్ విభాగం చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు.

**27 న రాకపోకలు నిషేధం:**

నెహ్రూవీధిలోని రామమందిరంలో శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 27న రాకపోకలను నిషేధించినట్లు ప్రకటించారు. పోలీసు అధికారులుఈ మేరకు ట్రాఫిక్‌ను మళ్ళించాలని సూచించారు. ఈ నెల 26 న సాయంత్రం ఆలయానికి శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సారె అందించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. కళ్యాణోత్సవం 27 న ఉదయం 10గంటలకు ప్రారంభం అయి 12గంటలు అభిజిత్ లగ్నమందు మాంగల్య ధారణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

వెంకటగిరి, మార్చి 22 ప్రభాతవార్త : వెంకటగిరి ఎపి రెసిడెంటిల్ జూనియర్ కళాశాల లోని ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్‌ల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏపీఆర్జేసీ సెట్ జిల్లా కన్వీనర్ డాక్టర్ పి.రమాదేవి ఒక ప్రకటనలో తెలియజెసారు. నాగార్జున సాగర్‌లోని డిగ్రీ కళాశాలలోని బిఏ 40, బి.కామ్ 60, బిఎస్‌సి 120, వెంకటగిరి జూనియర్ కళాశాలలో ఎంపిసి 60,బైపిసి 40 మరియు ఎంఈసి30 సీట్లకై ప్రవేశాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అలాగే తిరుపతి జిల్లా చిల్లమానుచేను, ముక్కవారి పల్లి బాలుర పాఠశాలలలో ఐదవ తరగతి 80 సీట్లకు, వెంకటగిరి బాలికల పాఠశాల లోని ఐదవ తరగతి లోని 80 సీట్లకు మరియు అన్నింటిలోని 6,7,8 వ తరగతుల లోని మిగిలివున్న సీట్లకు దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా ఆహ్వానించడమైనది. ఆసక్తిగల విద్యార్థులు మార్చ్ 31వ తేదీ లోపు అధికారిక వెబ్సైటు హెచ్‌టిటిపి:// ఏపిఆర్ఎస్.ఏపిసి ఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఏప్రిల్ 24వ తేదీన ప్రవేశ పరీక్ష తిరుపతిలో నిర్వహించబడుతుంది అని తెలిపారు. ఈ గురుకుల విద్యా సంస్థలలో ఆంగ్ల మాధ్యమంలో ఉత్తమ ప్రమాణాలతో విద్యా భోధన అందించబడుతుంది. అలాగే విద్యార్థులకు పౌష్ఠిక ఆహారం, వసతి వంటి సదుపాయాలను పూర్తిగా ఉచితంగా కల్పించబడతాయని అధికారులు తెలిపారు మరిన్ని వివరాలకై 8712625075, 8712625050, 8712625056, 8712625049 నంబర్లను సంప్రదించగలరు. 4 వ తరగతి పూర్తిచేసిన విద్యార్థులు 5వ తరగతికి, 10వ తరగతి పూర్తిచేసిన వారు ఇంటర్ మొదటి సంవత్సరానికి, ఇంటర్ పూర్తియైనవారు డిగ్రీ మొదటి సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకై గురుకుల వెబ్సైట్‌ని చూడాలని తెలిపారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## చిరంజీవి సేవాసంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



సూళ్లూరుపేట, మార్చి 22 ప్రభాతవార్త: పట్టణంలో పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి స్ఫూర్తితో గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ ముందస్తు జన్మదిన వేడుకలు చిరంజీవి సేవాసంఘం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. సూళ్లూరుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 55 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. చిరంజీవి సేవాసంఘం అధ్యక్షులు మాబాష మాట్లాడుతూ గొప్ప సేవా కార్యక్రమం ద్వారా తలసేమియా బాధిత చిన్నారులకు నూతన జీవం అందించడమే లక్ష్యమని తెలిపారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి సేవాసంఘం సభ్యులు షేక్ మాబాషా, నక్కా హరిబాబు, కయ్యాలకోటి, కరుణాకర్, చరణ్, సూర్య, బాబు, భాను, జనసేన నాయకులు ఆవుల రమణ, ఆవుల దాస్, రాము, ప్రవీణ్, వీరమహిళలు పద్మజ, సుజాత, రామ్‌చరణ్ అభిమానులు శ్రీమన్, శివ తదితరులు పాల్గొన్నారు.

## మరమ్మతులకు రూ.65 లక్షలు మంజూరు

**- తిరుపతి జిల్లా కోఆర్డినేట్ అధికారి పద్మజ**



సూళ్లూరుపేట, మార్చి 22 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో సమస్యలపై డిసిఓ తోట పద్మజ ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రెండు స్కూళ్లలో ఉండాల్సిన పిల్లలు ఒక్క సూళ్లూరుపేటలోనే 1,060 మంది ఉన్నారని, పాత డార్మెంటరీ బ్లాక్‌లో చాలా సమస్యలు ఉన్నాయని తెలిపారు. గురుకుల పాఠశాల నిర్మించిన తర్వాత చుట్టుపక్కల డెవలప్‌మెంట్ కావడంతో పాఠశాల ప్రాంగణంలోని డ్రైనేజి వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని తెలిపారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని, పిల్లలకు పెట్టే ఆహారం నాణ్యత విషయంలో సమస్యలుంటే సహించేది లేదని తెలిపారు. పాఠశాలలో జరిగే ప్రతి కార్యక్రమం తల్లిదండ్రులకు తెలిసేలా ఉండాలన్నారు. అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాల నిర్మించి 25 సంవత్సరాలు కావస్తున్న నేపథ్యంలో చిన్నపాటి సమస్య ఉన్నది వాస్తవమేనని, మళ్లీ సమస్యలు పునరావృతం కాకుండా స్కూల్ ప్రిన్సిపాల్ పర్యవేక్షణ ఉంటుందని డిసిఓ తోట పద్మజ తెలిపారు.

## మోడల్ స్కూల్ అడ్మిషన్స్‌కు దరఖాస్తు చేసుకోండి



వెంకటగిరి, మార్చి 22 ప్రభాతవార్త : ఆదర్శ పాఠశాలలో 2026 - 27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థినీ విద్యార్థులను చేర్చుకొనుటకు ఈ నెల ఆన్ లైన్ ద్వారా దరకాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తులసి జ్యోతి తెలిపారు. ఆ.ప్ర. పాఠశాల విద్య కమీషనర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల మోడల్ స్కూళ్లతో పాటు వెంకటగిరిలోని మోడల్ స్కూల్ నందు కూడా ఇంటర్ మొదటి సంవత్సరంలో విద్యార్థులకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. ఆదర్శ పాఠశాలలో బోధనా మాధ్యమం ఆంగ్లంలో ఉంటుంది. ఈ పాఠశాలలో విద్యనభ్యసించుటకు ఎలాంటి ఫీజులు లేవని తెలిపారు. వెంకటగిరి మండల పరిసర ప్రాంతాలలో 2025-26 విద్యా సంవత్సరం పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థినీ విద్యార్థులు మాత్రమే దరకాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ పాఠశాలలో యంపీసి, బైపిసి, ఎంఇసి, సిఇసి కోర్సులు ఉన్నాయన్నారు. ప్రతి గ్రూపుకు 40 సీట్లు కేటాయించినట్లు చెప్పారు. విద్యార్థులు తమ దరఖాస్తులను 2026 ఏప్రిల్ 30వ తేదీలోగా ఏదేని ఆన్లైన్ కేంద్రంలో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపిఎంఎస్. ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్సైట్లో ప్రవేశ రుసుముతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకోవడానికి ఓసి, బిసి, ఇడబ్ల్యూఎస్‌లకు చెందిన వారు 200 రూపాయలు, ఎస్‌సి, ఎస్‌టి కులానికి చెందిన వారు 150 రూపాయలు ఆన్ లైన్లో / నెట్ బ్యాంకింగ్/ క్రెడిట్, డెబిట్ కార్డులను ఉపయోగించి గేట్ వే ద్వారా ప్రవేశ రుసుము చెల్లించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకొన్న విద్యార్థులు ఆన్లైన్ కాపీతో పాటు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్, కుల ధ్రువీకరణ పత్రం, పాస్ ఫొటోతో స్థానిక మోడల్ స్కూల్లో అందజేయాలని తెలిపారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా రిజర్వేషన్ ప్రకారం ఆదర్శ పాఠశాలకు కేటాయించిన ప్రతి గ్రూపుకు 40 సీట్లు చొప్పున విద్యార్థినీ విద్యార్థు కేటాయిస్తారని చెప్పారు. విద్యార్థుల ఎంపిక జాబితాను మోడల్ స్కూల్‌లో 05.05.2026 తేదీ నోటిఫికేషన్ బోర్డులో ప్రకటిస్తామని వివరించారు. వెంకటగిరి మోడల్ స్కూలుకు సంబంధించిన వెబ్ సైటు డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ. ఏపిఎంఎస్‌వెంకటగిరి.కామ్‌ను కూడా తిలకించి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు. ఇతర వివరాలకు తమ పాఠశాలలో సంప్రదించవచ్చు అని తెలిపారు. ఆదర్శ పాఠశాలలో విద్యనభ్యసించుటకు అని వసతులు ఉన్నట్లు తెలిపారు.

## జిల్లా టిడిపి అధ్యక్షుడుకి సన్మానం



వెంకటగిరి, మార్చి 22 ప్రభాతవార్త: ఉమ్మడి నెల్లూరు జిల్లా టిడిపి అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన బీద రవిచంద్రను ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం అభినందనలు తెలిపారు. జిల్లా టిడిపి అధ్యక్షులు రవిచంద్ర సత్కరించారు. ఆయనతో పాటు నాయకులు అభినందనలు తెలిపారు.

## రూ. 30 వేల చెక్కును బాధితురాలకు అందజేత



వాకాడు, మార్చి 22 ప్రభాతవార్త: వాకాడు మండలం కొండాపురం గ్రామానికి చెందిన చెమ్మర్తి పద్మమ్మ అనారోగ్యానికి గురి కావడంతో కొండాపురం టిడిపి సీనియర్ నాయకుడు మోహన్‌నాయుడు చేతుల మీదుగా 30 వేల రూపాయలు చెక్కును ఆదివారం అందించారు. ఈ సందర్భంగా మోహన్ నాయుడు మాట్లాడుతూ మా నాయకుడు సన్నారెడ్డి విజయ్ శేఖర్‌రెడ్డి ద్వారా గూడూరు శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్‌కు అనారోగ్యంతో బాధపడుతున్న పద్మమ్మ గురించి తెలియజేసిన వెంటనే ఎమ్మెల్యే ముఖ్య మంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం 30 వేల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు విజయమ్మ, టిడిపి నాయకులు పనబాక కళ్యాణ్, చల్ల జనార్ధన్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## ఆత్మబంధువులకు అభినందనలు

**-సర్పంచ్‌లకు చెవిరెడ్డి ఘన సన్మానం**



చంద్రగిరి, మార్చి 22 ప్రభాతవార్త: నాతో కలసి ప్రయాణించిన ఆత్మబంధువులకు ప్రత్యేక అభినందనలు తెలియజేయడం సంతృప్తినిస్తున్నదని మాజీ ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. తొండవాడ ముక్కోటి వద్ద గల నారాయణీ గార్డెన్స్‌లో ఆదివారం చంద్రగిరి నియోజకవర్గంలోని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్‌లకు సన్మానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో రూ.978 పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసిన మిమ్మల్ని భవిష్యత్తు తరాలు తప్పక గుర్తుంచు కుంటాయని అన్నారు. ప్రాణాంతక మహమ్మారి కరోనా మనల్ని చుట్టు ముట్టడంతో రెండేళ్ళు వృధాగా గడిచిపోయినట్లు తెలిపారు. కేవలం మూడేళ్ళ కాలంలో 5096 అభివృద్ధి పనులను రూ.978 కోట్లతో పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి పంచాయతీలో సుమారు రూ.5 నుండి రూ.10 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ నియోజవర్గంలోని సర్పంచ్‌లు అభివృద్ధికి ప్రతీకలుగా నిలిచారని కొనియాడారు. మీరు చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించుకోవడానికి కేవలం ప్రారంభోత్సవాలకే రెండేళ్ళ సమయం పట్టిందంటే ఏ మేరకు అభివృద్ధి చేశారో అవగతమవుతుందన్నారు. ప్రస్తుత సర్పంచ్‌లు రేపటి జగనన్న సైనికులని అన్నారు. అంతకుముందు మాజీ ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 90 మంది సర్పంచ్‌లకు సన్మానం చేశారు.

## పాతగుంటలో హోరేత్తిన గిత్తల పోరు

**- చెదురుమదురు సంఘనలు - జనసముద్రంగా మారిన పాతగుంట**



వెదురుకుప్పం, మార్చి 22 ప్రభాతవార్త : మండలంలోని పాతగుంటలో ఆదివారం నిర్వహించిన జల్లికట్టు గిత్తల పోరు హోరేత్తింది. జట్టుకట్టు సంబరాలు అంబరాన్ని అంటాయి... కొడేగిత్తలు రంకేలు వేయడంతో యువకులు పౌరుషంతో బరిలోకి దిగడంతో జలికట్టు సంబరాలు ప్రారంభమైన్నాయి. రైతులు గిత్తలకు కొమ్ములు చెక్కి రంగులు వేసి చెక్క పట్టీలు కట్టి అందంగా అలంకరించారు. యువకులు గ్రామంను రంగుపేపర్లు, మామిడి తోరణాలతో అందంగా ముస్తాబు చేశారు. ఇష్ట దైవం, రాజకీయ నాయకులు, సినిమా నటుల ఫోటోలతో కొమ్ములకు చెక్క పట్టీలు,టవలు, నగదు కట్టి బరిలోకి దించారు.గ్రామంలోకి జనం చేరుకోవడంతో మిద్దెలు, వీధులు జన సంద్రంగా మారిపోయాయి. అలంకరించి గిత్తలను దప్పుల దరువులు మధ్య అల్లె వద్ద వదలడంతో యువకులు రెట్టించిన ఉత్సహంతో బరిలోకి దిగి చెక్క పట్టీల కోసం గిత్తలతో కుస్తీకి దిగడంతో ఈలలు, కేరితల నడుమ నువ్వా... నేనా అంటూ పోటా పోటీగా పోరు జరిగింది. కొన్ని గిత్తలు దొరికిపోవడంతో యువకులు చెక్క పట్టీలను చేజిక్కించుకుని విజయదరహాసంతో కేరితలు కొట్టారు.మరీ కొన్ని గిత్తలు జనంను చీల్చుకుంటూ యువకులను నిరాశ పర్చుతూ పరుగులు పెట్టాయి... పోటా పోటీగా సాగిన గిత్తల పోరులో కొన్ని సార్లు గిత్తలదే పై చేయికాగా... కొన్ని సార్లు యువకులదే పైచేయిగా మారింది. దుమ్ము రేపుతూ గిత్తలు చేసిన సందడిని మిద్దెలపై నుంచి వీక్షించిన చూపరులకు కనులవిందు చేసింది. గిత్తల పోటీలు రసవత్తంగా సాగాయి. చెదురు మదురు సంఘటలు మినహా అద్యంతం పోటీలు రసవత్తంగా జరిగాయి. ప్రశాంత వాతావరణంలో పండుగా నిర్వహించుకున్నారు. చుట్టపక్కల మండలాల నుంచి జనం తరలివచ్చారు. జల్లికట్టు సంబరాలను వీక్షించడంకు వచ్చిన వారికి అసౌకర్యం కలుగకుండా మంచినీటి వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో పోటీలు జరగడంతో నిర్వహకులు పోటీలకు సహకరించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతాలు తెలిపారు. కాగా పాతగుంటలో జరిగిన పోటీలలో రెండు గిత్తలు మృత్యువాతపడిన్నట్లు సమాచారం. జల్లికట్టు పోటీలకు వదలి ఓ గిత్త సమీపంలోని చెరువులోకి దిగిపోవడంతో బురదలో చిక్కుకుపోయి ప్రమాదవ శాత్తు మరణించిగా, మరోగిత్త మృతిచెందిన్నట్లు చెప్పారు. సాధారణంగా సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా కనుమ రోజు పశువుల పండుగా జల్లికట్టు సంబరాలు జరుపుకోవడం ఆనవాయితి. కాగా ప్రస్తుతం ఏడాది పొడువునా పశువుల పండుగ జరుపుకుని మూగజీవులను హింసకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైందవ సంప్రదాయంలో గోవులను పవిత్రంగా భావించి పూజ చేసే సంస్కృతి ఉందని అలాంటి ఉన్నత సంస్కృతికి విడనాడి మూగజీవులతో ఆటవిడుపు చేసి ఆనందం పొందడంపై పశు ప్రేమికులు విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారులు స్పందించి సంక్రాంతి సంబరాలు మినహా మిగిలిన సమయాల్లో జల్లికట్టు నిర్వహణపై ఆంక్షలు విధించాలని కోరుతున్నారు.

## ఏడు సెగ్మెంట్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం

**- త్వరలో పాకాల - కాట్పాడి డబ్లింగ్ రైల్వే లైన్ పనులకు కృషి - ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావు**



తిరుపతి హెల్త్, మార్చి 22 ప్రభాతవార్త: చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో సమాన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. గడిచిన రెండేళ్ల కాలంలో చిత్తూరు ప్రాతినిధ్య ఎంపీగా పాకాల – కాట్పాడి డబ్లింగ్ రైల్వే లైన్ పనుల కోసం కృషి చేస్తూ డిపిఆర్లు తీసుకువచ్చి పనులు ప్రారంభమై త్వరలోనే అందుబాటులోకి డబ్బింగ్ రైల్వే లైన్ రానుందన్నారు. అలానే ఎంతో కీలకమైన రైల్వే షెడ్డు చిత్తూరులో డిపిఆర్ దశ నుండి పనులు ప్రారంభమయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నిర్వహింపబడుతున్న కేంద్రీయ విద్యాలయాలను చిత్తూరు నియోజకవర్గానికి తీసుకురావడం, దేశవ్యాప్తంగా 14 కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటుకు అనుమతులు వస్తే అందులో కుప్పం, చిత్తూరు, మదనపల్లిలో మూడు కేంద్రీయ విద్యాలయాలను తీసుకువచ్చామన్నారు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంతా లలో 75 శాతం ఆయా గ్రామాల ప్రజలకు ఉపయోగపడే ప్రధాన రోడ్లు, అనుసంధాన రోడ్లు నరేగా నిధులతో, 15వ ఆర్థిక సంఘం నిధులతో పూర్తి చేసామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజానీకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయంలో భాగంగా ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే ఉద్దేశంతో 60 మంది ఫెసిలిటేటర్స్‌ను ఏర్పాటు చేసి నిరుద్యోగ శాతాన్ని తగ్గిస్తూ స్వయం ఉపాధిని పెంపొందించుకునే విధంగా ఎంఎస్ఎంఈ కార్యక్రమాన్ని వేగవంతం చేస్తూ 1600 మందిని అవగాహన కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. రెండేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో మామిడి రైతులకు గిట్టుబాటు ధరతో పాటుగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సహకార నిధులను కూడా రైతులకు అందించామన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా కుప్పం వరకు ఇప్పటికే నీరు చేరిందని, దీని ద్వారా కాలువకుండా ఉండే గ్రామాలలో చెరువులు నిండుతూ భూగర్భ జలాలను పెంపొందిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, విలేజ్ క్లినిక్లను అభివృద్ధి చేసుకోవడానికి, వసతులు మెరుగుపరచుకోవడానికి దాదాపుగా రూ. 65 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం నుండి మంజూరు చేయించామన్నారు. సామాన్య మధ్యతరగతి ప్రజలకు విద్యుత్ చార్జీల భారాల నుండి ఉపశమనం కలిగించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా వేల ఇళ్లకు సౌర శక్తిని అందించే విధంగా చర్యలు తీసుకొని, ఇండ్లకు సబ్సిడీ ఇస్తున్నామన్నారు. హౌసింగ్ స్కీమ్ ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయాన్ని తీసుకువస్తూ, రెవెన్యూ విభాగానికి సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేసేలా కృషి చేస్తానని అన్నారు. రాబోయే రోజులలో చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాలను పరిశీలించి ఆయా ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

**నెలాఖరుకు వెయ్యి ఇండ్లు...**

## జూన్ 30 నాటికి అన్ని ఇచ్చేస్తాం



శ్రీకాళహస్తి,మార్చి 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో చేపట్టిన టిడ్కో ఇళ్ళలో ఈ నెలాఖరుకు వెయ్యి ఇళ్ళను లబ్ధిదారులకు అందించుటకు సన్నాహాలు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ ఆదివారం తెలిపారు. శ్రీకాళహస్తిలో ఎంతో కాలంగా ఆగిన పన్నుల వసూళ్లలో సిబ్బందిని పరుగులు తీయిస్తున్నామని మొండిబకాయిల వసూళ్ళకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని కమిషనర్ వివరించారు. తాను బాధ్యతలు చేపట్టేనాటికి జటిలమైన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న టిడ్కో ఇళ్ళకు సంబంధించి నిర్మాణ ఏజెన్సితో పలు మార్లు చర్చించినట్లు వివరించారు. అంతేకాక స్థానిక శాసన సభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పలు మార్లు సంబంధిత శాఖ మంత్రితో చర్చించిన మీదట ఏజెన్సి నిర్వాహకులు ముందుకు వచ్చారన్నారు.వారి ద్వారా అర్థాంతరంగా ఆగిన ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయించామని వివరించారు. ఇకమౌళిక సదుపాయాలైన మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా, రోడ్ల నిర్మాణంతో పాటు అంతర్గత రోడ్లు ఏర్పాటు విషయంలో ప్రత్యేక శ్రద్ద తీసుకున్నామని వివరించారు. ఇక్కడ మొత్తం 5500 ఇళ్ళు మంజూరు చేయటం జరిగిందన్నారు. ఇందులో ఐదేళ్ళలో పలువురు జగనన్న కాలనీలో స్థలాలు తీసుకున్నట్లు నమోదైందన్నారు. కొందరు స్వచ్ఛందంగా తమ సొమ్ములు వాపసు ఇవ్వమని కోరారన్నారు. అలాంటి తొలగించి డబుల్ బెడ్‌రూం ఇళ్లు వెయ్యి ఈ నెలాఖరుకు అందించుటకు ముస్తాబు చేస్తున్నట్లు కమిషనర్ వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయుడుపేటలో ప్రారంభించే సమయంలో ఇక్కడ కూడా వెయ్యి ఇళ్ళను అందించుటకు నిర్ణయం తీసుకున్నామని కమిషనర్ భవాని ప్రసాద్ వివరించారు. కాగా జూన్ 30 నాటికి టిడ్కో ఇళ్లు పూర్తిగా అందించుటకు యుద్ద ప్రాతిపదికపై పనులు నిర్వహించుటకు ప్రయత్నిస్తున్నామని వివరించారు.

**పన్ను వసూళ్ళకు కఠిన చర్యలు:**

శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో గత కొంత కాలంగా పన్నుల చెల్లింపులకు సంబంధించి కొందరు ఇంటి యజమానులు పెద్ద మొత్తంలో బకాయిలు పెంచుకున్నారని అయితే ఈ ఏడాది మున్సిపల్ సిబ్బందితో పాటు,సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసి పన్నుల వసూళ్ళకు చర్యలు తీసుకున్నామన్నారు. ఏడాది డిమాండ్ రూ.12కోట్లు కాగా ఇప్పటి వరకు తమ సిబ్బంది కృషితో రూ.7.5కోట్లు వసూలు చేసామన్నారు.అంటే సుమారు 65శాతం పన్నుల వసూలు చేసామన్నారు. అయితే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల భవనాలకు సంబందించి ఒక్క కోర్టు భవనాలు తప్ప మరే కార్యాలయానికి సంబంధించి పన్నులు వసూలు కావటం లేదన్నారు.ఈ నేపధ్యంలో సుమారు రూ.4 నుంచి 5కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు. ఇందులో ప్రధానంగా కాసాతోటలోనే ప్రభుత్వ భవనాలకు సుమారు రూ.2కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు.మరో పెద్ద మొత్తం స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల అని వివరించారు. ఇక పోలీసు స్టేషన్లు,రైల్వే స్టేషన్,ఆర్అండ్ బి భవనాలు,అగ్నిమాపక భవనాలు,ఎపి టూరిజం తదితర ప్రభుత్వ కార్యాలయాలు పన్నులు చెల్లించాల్సి ఉందన్నారు. అయితే ఈ నెలాఖరుకు నూరు శాతం పన్నుల వసూళ్ళు చేయాలన్నది లక్ష్యంగా కమిషనర్ భవాని ప్రసాద్ వివరించారు.

## కుప్పంలో నారా భువనేశ్వరి పర్యటన

**- నాలుగు రోజులు మకాం.. గ్రామాల్లో విస్తృత పర్యటన**



కుప్పం, మార్చి 22 ప్రభాతవార్త: సిఎం చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఈనెల 24-27తేదీల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు పర్యటన ఖరారైంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సి పాలిటీలో పర్యటిస్తారు. నారా భువనమ్మ పర్యటన వివరాలు ఇలా... ఈనెల 23వతేది సాయంత్రం నారా భువనేశ్వరి శాంతిపురం మండలం శివపురం వద్ద తమ స్వగృహంకు చేరుకుంటారు. 24వతేది ఉదయం ఇంటి వద్ద ప్రజలనుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారు. 10గంటలకు కుప్పం మండలం మంకలదొడ్డి చేరుకుని మహిళలతో సమావేశం అవుతారు. అక్కడే అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శిస్తారు. అనంతరం 12గంటలకు శింగారపురం చేరుకుని అక్కడ మహిళలతో సమావేశమవుతారు. అనంతరం మొట్లచేను, కూసూరు గ్రామాల్లో మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. కూసూరులో రైతులతో మాట్లాడతారు. సాయంత్రం 4.45గంటలకు పైపాళ్యం చేరుకుని అక్కడ విలువల బడికి హాజరవుతున్న విద్యార్థులతో మాట్లాడతారు. సాయంత్రం 5.15 గంటలకు స్వగృహం చేరుకుంటారు. రాత్రి 7.30గంటలకు కుప్పం టిటిడి కళ్యాణ మండపంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ రోహిత్ వివాహంకు హాజరై రాత్రి స్వగృహంలో బసచేస్తారు. 25న ఉదయం 9.30గంటలకు ఇంటి వద్ద ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం కడ సభ్యుడు రాజ్‌కుమార్ గృహ ప్రవేశ కార్యక్రమంకు హాజరవుతారు. అక్కడనుంచి కుప్పం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌కు చేరుకుని అక్కడ జాబ్‌మేళా కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2గంటలకు గుడుపల్లె మండలం పెద్దకోటమాకులపల్లిచేరుకుని అక్కడ మహిళలతో సమావేశమవుతారు. అనంతరం తంబిగానిపల్లిలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ ఇ ంటికి వెళ్తారు. అక్కడనుంచి స్వగృహం చేరుకుంటారు. 26న ఉదయం ఇ ంటి వద్ద ప్రజలనుంచి వినతులు స్వీకరిసాకతరు. అక్కడనుంచి శాంతిపురం చేరుకుని 10.30గ ంటలకు అన్న క్యాంటీన్ పరిశీలిస్తారు. అనంతరం ఇటీవల మృతి చెందిన ఐటిడిపి నేత రవికుటుంబాన్ని గుండిశెట్టిపల్లిలో పరామర్శిస్తారు. అనంతరం 11.45గంటలకు రామకుప్పంలో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ అనంతరం బహిరంగసభలో ప్రసంగిస్తారు. అక్కడనుంచి స్థానిక శివాలయం చేరుకుని ఉత్సవంలో పాల్గొంటారు. అనంతరం మణీంద్రం, బళ్లలో పర్యటిస్తారు. బళ్లలో మహిళలతో మాట్లాడతారు. సాయంత్రం 4గంటలకు కుప్పంలో తెదేపా రాష్ట్ర నేత గోపీనాథ్‌కు చెందిన రాయల్ ఇన్ కాంప్లెక్స్‌ను ప్రారంభించి స్వగృహం చేరుకుంటారు. 27న ఉదయం కుప్పంలోని శ్రీరాములవారి ఆలయంలో పూజల అనంతరం 9.00గంటలకు ఇటీవల మృతి చెందిన తెదేపా నేత బాలకుమార్ ఇంటికి వెళ్తారు. అక్కడనుంచి 9.30గంటలకు టిటిడి కళ్యాణ మండపం చేరుకుని ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం బెంగళూరుకు పయనమవుతారు.

## కేంద్ర మంత్రిని సన్మానించిన నిషిధరాజు



పుత్తూరు, మార్చి 22 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీకి చెందిన కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, సమాచార, ప్రసార శాఖల సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్‌ను బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.నిషిధరాజు ఆదివారం శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. తమిళనాడుకు చెందిన కేంద్ర మంత్రి గతంలో చెన్నై నుంచి పుత్తూరు మీదుగా తిరుపతి వెళుతూ... అంజేరమ్మ గుడికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత టోల్‌గేట్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో పెద్ద ప్రమాదం నుంచి తనను అంజేరమ్మ తల్లే కాపాడిందని మంత్రి విశ్వసించారు. ఆ మేరకు ఆదివారం ఆయన అంజేరమ్మ ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను నిషిధరాజు కలిశారు.

## నేడు డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి

తిరుపతి,మార్చి 22 ప్రభాతవార్త: తిరుపతి ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం పరిధిలోని తొమ్మిదిజిల్లాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేటి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు "డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి కార్యక్రమం" నిర్వహిస్తున్నారు. వీలుగా వినియోగదారులు అవకాశం వినియోగించుకోవాలి

## దండం పెడతాం...అన్నం పెట్టండి!

రైల్వే కోడూరు, మార్చి 22 ప్రభాతవార్త: మహాప్రభు దండం పెడతాం అన్నం పెట్టండి. ఈ పరిస్థితి రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ముక్కావారిపల్లి ఏపీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు పడుతున్న ఆకలి ఆవేదనలను తెలుసుకొని వారి తల్లిదండ్రులు పాఠశాల నిర్వహకులను నిలదీయాల్సింది పోయి ప్రాధేయపడుతూ పిల్లలకు అన్నం పెట్టండి మీకు దండం పెడతాం అంటూ పాఠశాల లోపల నిర్వహకులను అడుక్కుంటున్నారు. ఆ పాఠశాల యాజమాన్యం స్పందించి గది నుంచి బయటికి రాకపోవడం, సమాధానం చెప్పకపోవడం ఆ తల్లిదండ్రుల మనసులను కలచివేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఒకవైపు పిల్లల చదువుపట్ల పరీక్షల దృష్ట్యా భయము, మరోవైపు ఆకలి బాధలతో గురుకుల విద్యార్థులకు వంట చేసేవాళ్లు ఏదో ముక్కుబడిగా ఆదివారం వచ్చి వంట మొదలుపెట్టినట్టు తెలిసింది. గత మూడు నాలుగు రోజుల నుంచి ఆకలి మంటలను ఆర్పుకునేందుకు పిల్లలు పడ్డ అవస్థలు వర్ణనాతీతం. ప్రస్తుత పరిస్థితుల్లో కూడా పాఠశాల ప్రిన్సిపాల్‌కు సరైన సఖ్యత కుదిరినట్టు లేనట్లే తెలుస్తుంది. ఈ పరీక్షల సమయాల్లో వంటవాళ్ల ఏ రోజు ఎగనామం పెట్టిన పిల్లల పరిస్థితి అయోమయం. వచ్చే నెల మూడు నుంచి మిగతా తరగతుల పిల్లలకు కూడా వార్షిక పరీక్షలు జరుగుతాయి. ఈ విషయమై తల్లిదండ్రులు యాజమాన్యాన్ని పిల్లల ఆకలి చూడలేక బాగానే ప్రాదేయ పడినట్లు తెలుస్తుంది. అయితే ఆయన నుంచి సరైన సమాధానం ఆ తల్లిదండ్రులకు భరోసా లేకపోవడంతో పాఠశాల సిబ్బంది ఒకరి ఇద్దరు వచ్చి ప్రిన్సిపాల్ గత ఏడాది అక్టోబర్ లోని పదోన్నతిపై రావడం జరిగిందని ఆయనకు రెసిడెన్షియల్ బాధ్యతలు పెద్దగా తెలియకపోవడంతోనే వంట వాళ్లతో విభేదాలు పెట్టుకుని ఇలాంటి పరిస్థితులు దాపరిచాయని కొన్ని దశాబ్దాలుగా ఈ పాఠశాల ప్రారంభం నుంచి ఇలాంటి సమస్యలు రాలేదని పరీక్షల సమయాలలో విద్యార్థులకు భోజనాల పట్ల ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకుంటామని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు భరోసానించారు.

**PASSPORT MISSING**

పెనగలూరులో ప్రయాణం చేసేటప్పుడు పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. **V5855963** కావున దయచేసి దొరికినవారు ఈ ఫోన్ నెంబరు: **8897716257**, అడ్రస్సు: Seemakurthi Sivamma W/o S.Surya Narayana, Indlur (Vi), Pena galuru (Po), Penagalur (M), Tirupathi (Dist), Andhra pradesh.

# నల్ల చట్టాలతో అన్నదాతకు సంకెళ్ళు

## రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్




శ్రీకాళహస్తి, మార్చి 22 ప్రభాతవార్త

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందిస్తున్న నల్ల చట్టాలతో అన్నదాతలకు సంకెళ్ళు వేస్తున్నారని రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ ధ్వజమెత్తారు.ఆదివారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రైతుల నుద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయరంగంలో నల్లచట్టాలను తెచ్చి కేంద్రం రైతు ఉరి బిగిస్తుందని ధ్వజమెత్తారు.కార్పొరేట్‌లకు ఎర్రతివాచి పరచి నల్లచట్టాలను రైతులకు నష్టం కల్గించే విధంగా వ్యవహారిస్తున్నారన్నారు. ఇందుకు రాష్ట్రాల్లో అమలుకు నిర్ణయించటం దారుణమన్నారు. ఎపి రైతు జిల్లా ౦రెండవ మహాసభలను శ్రీకాళహస్తిలో ప్రారంభించారు. అంబేద్కర్ కూడలి నుంచి సుందరయ్యభవనం వరకు శ్రీకాళహస్తి,సత్యవేడు,వెంకటగిరి, సూళూరుపేట నియోజకవర్గాల నుంచి తరలి వచ్చిన రైతుల సమక్షంలో ర్యాలి నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ముందు రైతు సంఘ జెండాను ఆవిష్కరించారు. ఇక్కడ బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభలో ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఏటా కార్పొరేట్‌లకు వరాలు కురిపిస్తూ రుణ రాయితీలను అందిస్తున్న కేంద్రం రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించటంలో వైఫల్యం చెందుతుందన్నారు. ఏటేటా పెట్టుబడి వ్యయం పెరుగుతుంటే మద్దతు ధర కల్పించాల్సిన ప్రభుత్వాలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధ కాండతో రాష్ట్రంలోమొక్కజొన్న,పత్తి, మిరప రైతులు కుదేలౌతున్నా కేంద్రం మొద్దు నిద్రలో జోగుతూ అన్నదాతలకు అన్యాయం చేస్తున్నారన్నారు. సరైన విదేశాంగ విధానం లేకపోవటమే కారమణమన్నారు.తిరుపతి జిల్లా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవటంతో రైతులు కల్లాలోనే కష్టాలను అమ్ముకుంటూ కన్నీళ్ళు దిగమింగుతున్నారన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోసరైన సాగునీటి పథకాలు లేనందువల్ల పంటల సాగు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు.వెంటనే ఎస్ ఎస్ కెనాల్ పనులు పూర్తి చేయాలన్నారు.అలాగే రైతులకు ఉచితంగా బోర్లు వేసి ఆదుకోవాలన్నారు.ఈ కార్యక్రమాల్లో రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు రంగయ్య ప్రదాన కార్యదర్శి హేమలత, పూర్వపు కార్యదర్శి అంగేరి పుల్లయ్య, కోశాధికారి ధనంజయ,మణి, అల్లెయ్య, రమణయ్య, గంధం మణి తదితరులు పాల్గొన్నారు.

## హరికథ సకల కళల సమ్మేళనం: వీసీ జె వి రమణ

తిరుపతి విద్య, మార్చి 22 ప్రభాతవార్త



హరికథ సంగీతం, నాట్యం, నటన వంటి సకల కళల సమ్మేళనమని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వీసీ ఆచార్య జంపాల వెంకటరమణ తెలిపారు. విశ్వామిత్ర సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్‌జీబాజీ కాలనీలో నిర్వహించిన హరికథకుల సత్కార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.హరికథలోని సందేశం సమాజాన్ని జాగృతం చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ వై. వెంకటేశ్వర్లు హరికథను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పలు తరాలకు చెందిన హరికథకులను సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ముచ్చివోలు రామమందిరం కుంబాభిషేకం

శ్రీకాళహస్తి రూరల్,మార్చి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామంలో రూ.రెండున్న కోటితో నిర్మించిన సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత సీతారామచంరద స్వామి వారి ఆలయ కుంబాభిషేకం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిధిగా స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంటకసుధీర్‌రెడ్డి హాజరు కానున్నారు.దేవాదాయశాఖ నిధులతో నాలుగు సంవత్సరాల ముందు నిర్మాణ పనులు ప్రారంభించారు. ముచ్చివోలు గ్రామంలో శ్రీరామ మందిరం, వినాయక గుడి, పాండురంగ స్వామి ఆలయాలున్నాయి. ప్రతి నెల ఏదో ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు.ఇక్కడ పాండురంగ స్వామి అగ్నిగుండ కార్యక్రమాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు హాజరౌతారు. ఈ నేపధ్యంలో ఇక్కడ దేవాదాయశాఖ సౌజన్యంతో నిర్మించిన ఆలయ కుంబాభిషేకం ధ్వజస్థంభం కార్యక్రమాలు భగవత్ ప్రార్థనలతో ప్రారంభమౌతాయి.25 వ తేదీ సంప్రదాయబద్దంగా మహాకుంబాభిషేకం కార్యక్రమాలు నిర్వహించుటకు నిర్ణయించారు.

## ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా నారా భువనమ్మ విశేష సేవలు

– ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, మార్చి 22 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గ ప్రజలను తమ బిడ్డల్లా సిఎం చంద్రబాబునాయుడు, సిఎం సతీమణి నారా భువనేశ్వరమ్మ భావిస్తారని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున భువనమ్మ విశేష సేవలు అందిస్తున్నారన్నారు. మహిళలకు ఉచితంగా కుట్టుశిక్షణ, ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ, చిరు వ్యాపారులకు తోపుడు బళ్లు, అవసరం ఉన్న వారికి ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు అందిస్తున్నారన్నారు. అలాగే కుప్పంలో ఎన్టీఆర్ సంజీవని ఆస్పత్రి ఏర్పాటుచేయించి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారన్నారు.ఎన్టీఆర్ ఆరోగ్య రథం ద్వారా గ్రామాలోల సైతం ప్రజలకు ఉచిత వైద్యం, మందులు అందించడం జరుగుతోందన్నారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా నారా భువనమ్మ ట్రస్ట్ ద్వారా ఈ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఇప్పటికే 7203కోట్లతో 7భారీ పరిశ్రమలకు శంకుస్థాపన చేశారన్నారు. త్వరలోనే కుప్పం మినీ ఇండస్ట్రియల్ హబ్‌గా మారబోతుందన్నారు. జూన్ నెలలో కుప్పం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగే అవకాశం ఉందన్నారు. కేంద్రం అనుమతుల కోసం అధికారులు ఫైల్స్ రూపొందించారన్నారు. కుప్పంలో అభివృద్ధి అంటే 2024కు ముందు ఆ తర్వాత అనే రీతిలో జరుగుతోందన్నారు. మంత్రి నారా లోకేష్ సైతం కుప్పంలో 3వేల కోట్లతో అతా గ్రూప్ ద్వారా భారీ పరిశ్రమ ఏర్పాటుకు సహకరించారన్నారు. కుప్పం ప్రజలు నారా భువనమ్మ పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనమ్మ ఇచ్చిన మాట మేరకు ప్రతి మూడు నెలలకు ఒసారి కుప్పం వచ్చి ప్రజల సాధక బాధలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారన్నారు. ట్రస్ట్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారన్నారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కడ సభ్యురాలు సుగుణమ్మ, కార్పోరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజ్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కన్నన్, శ్రీనివాసులు,మాజీఎంపిపి డాక్టర్ వెంకటేష్, కో క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.5 లక్షల విలువైన పొగాకు ఉత్పత్తులు పట్టివేత

**చిత్తూరు, మార్చి 22 ప్రభాతవార్త:** చిత్తూరు టుటౌన్ పోలీసులు శనివారం రాత్రి 5 లక్షల విలువైన పొగాకు ఉత్పత్తులను పట్టుకుని రెండు వాహనాలతో పాటు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సిద్దార్థ నగర్ నుండి పొగాకు ఉత్పత్తులు అక్రమ రవాణా జరుగుతుందని టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్యకు సమాచారం రావడంతో ఆయన ఆధ్వర్యంలో పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్లారు. అయితే అప్పటికే అక్కడి నుండి రెండు వాహనాలు బయలుదేరి ఒకటి తమిళనాడు వేలూరు, మరొకటి కర్నాటక బెంగళూరు వైపుకు వెళ్ళిపోయాయి. ఆ మేరకు ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య ఈ విషయంపై గుడిపాల ఎస్ఐకు సమాచారం అందించడంతో ఆయన చిత్తూరు-వేలూరు రహదారిపై కాపు కాసి ఒక వాహనంను పట్టుకున్నారు. ఆ వాహనంలో 23 సంచుల పొగాకు ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరోవాహనంను గుర్తించడానికి ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య టుటౌన్ ఎస్ఐ రమేష్‌బాబును ఉపయోగించారు. ఎస్ఐ రమేష్‌బాబు వాహనం వద్దకు చేరుకుని తనిఖీలు చేయగా అందులో 22 సంచుల పొగాకు ఉత్పత్తులు లభ్యం అయ్యాయి. పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను విచారించిన పోలీసులు తాము కర్నాటక రాష్ట్రం బొమ్మసంద్ర నుండి పొగాకు ఉత్పత్తులను అక్రమంగా కొనుగోలు చేసి జిల్లాలో అక్కడక్కడ తరలించి వ్యాపారం చేస్తున్నట్లు అంగీకరించారు. పట్టుబడిన వారిలో చిత్తూరు నగరంకు చెందిన సునీల్ పటేల్, నేమిచంద్‌లు, తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం తాలుకా మెడికుప్పంకు చెందిన శ్రీనివాసులు వున్నారు.

## వృద్ధాశ్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సహాయ కార్యక్రమాలు

తొట్టంబేడు,మార్చి 22 ప్రభాతవార్త




శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మార్గంలోని గివింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో ఆదివారం హెల్పింగ్ హ్యాండ్స్ సారథ్యంలో సహాయ కార్యక్రమాలను సంస్థ వ్యవస్థాపకులు మునీర్‌బాషా సారథ్యంలో ఏర్పాటు చేసారు. అంగవైకల్యం కల్గిన కుటుంబాలకు సుమారు 180నెలల నుంచి ఆదుకుంటున్న సంస్థ ఆదివారం తమ కుటుంబసభ్యులతో కలసి వృద్ధాశ్రమంలో వృద్దులకు పండ్లు అవసర వస్తువులను అందించారు.ఈ సందర్భంగా మునీర్‌బాషా మాట్లాడుతూ ఓ వైపు తాము తమ సొంత సంపాదనలో కొంత దాన ధర్మాలు చేయాలనే లక్ష్యంతో ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యవసర సరకులు అందిస్తున్నామన్నారు. ఆసుపత్రులకు కావాల్సినఅవసరాలను గుర్తించి వీల్ ఛైర్స్‌ను అందించామన్నారు. కొంత మంది ప్రత్యేక ప్రతిభావంతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొనుటకు తమ షాపులో ఉపాధి కల్పన చేసామన్నారు. గివింగ్‌హ్యాండ్స్ స్వచ్ఛందసేవా సంస్థ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి తమ వంతు సహాయం అందిస్తామన్నారు.ఇక్కడ ఉ ంటున్న వృద్దులకు పండ్లు పంపిణి చేసారు.

## ద్విచక్రవాహనాల కట్టడికి పోలీసు తనిఖీలు

శ్రీకాళహస్తి,మార్చి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలో లైసెన్సుల్లేకుండా ద్విచక్రవాహనాలను నడుపుతున్న యువకులను కట్టడి చేయటానికి డివైయస్‌పి నరసింహా మూర్తి ఆదేశాలతో వన్‌టౌన్ పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. కూడలి ప్రాంతమైన దేవస్థానం సమాచార కేంద్రం వద్ద ట్రాఫిక్ పోలీసులు ఎఎస్ఐ గోవిందు,మునస్వామి పర్యవేక్షణలో వారి సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు.ఈ నేపధ్యంలో లైసెన్సులున్నాయా? వాహనానికి సంబంధించి రికార్డులు సక్రమంగా ఉన్నాయా? అని పరిశీలిస్తున్నారు. రికార్డులు లైసెన్సుల్లేని వాహన దారులకు జరిమానాలు విధిస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఎఎస్ఐ మునస్వామి, కానిస్టేబుల్స్ వెంకటేశ్వర్లు, పురుషోత్తం రెడ్డి, హేమంత్‌లు ఒక వైపు ద్విచక్రవాహనాలు, మరో వైపు ఆటోలను తనిఖీ చేసారు.

## కుంబాభిషేకం నిర్వహణకు రూ.40లక్షలు సంభావనలు

ఏర్పేడు,మార్చి 22 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో వచ్చే నెల 19 నుంచి ప్రారంభమయ్యే మహాకుంబాభిషేక పూజలలో అర్చకుల సంభావనలకు రూ.40లక్షలు అవసరమని ధర్మకర్తల మండలి, ఆలయాధికారులు బడ్జెట్‌ను తయారు చేసారు.ఈ సొమ్ముల చెల్లింపుల్లో దాతలను భాగస్వాముల్ని చేయుటకు పరుగులు తీస్తున్నారు. ఆలయ మరమ్మత్తులను పురావస్తు శాఖ పర్యవేక్షిస్తుంది. ఈ నేపధ్యంలో ఐదు రోజుల పాటు పూజలు, హోమాలు, నిర్వహించుటకు ప్రణాళికలు రూపొందించారు.ఈ నేపధ్యంలో పండితుల సంభావనలు రూ.20లక్షలు,పూజా సామగ్రికి రూ.4లక్షలు,యాగశాల నిర్మాణానికి రూ.3.5లక్షలు,పుష్పాలంకరణకు రూ.3లక్షలు వంట పరిచారకులకు రూ.1.8లక్షలు విద్యుత్ దీపాలంకరణకు రూ.2లక్షలు యాగశాల మండప నిర్మాణానికి రూ.3లక్షలు కుంబాభిషేక సర్వాలకు రూ.2లక్షలు నిధులు కావాలని బడ్జెట్ రూపొందించారు. భక్తులు ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని ఛైర్మెన్ బత్తల గిరినాయుడు పిలుపు నిచ్చారు.

## పరిశ్రమల యాజమాన్యాలు కార్మిక చట్టాలను గౌరవించి, అమలు చేయాలి

– డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు

వరదయ్యపాలెం, మార్చి 22, ప్రభాతవార్త



దేశంలో కార్మికుల హక్కులను పరిరక్షించడానికి రూపొందించిన లేబర్ కోడ్ నిబంధనలు కాగితాలకే పరిమితం అవుతున్నాయా? అనే ప్రశ్నలు ప్రస్తుతం ఉత్పన్నమవుతున్నాయి. ఇటీవల సోషల్ మీడియాలో 12 గంటల పని అంటూ ప్రచారం జరుగుతున్న సందేశాలు కార్మిక వర్గంలో ఆందోళన కలిగిస్తున్నాయి. నియమావళికి విరుద్ధంగా అధిక పని గంటలు విధించడం కేవలం చట్ట విరుద్ధమే కాకుండా, కార్మికుల ఆరోగ్యం, మానవ హక్కులపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల యాజమాన్యాలు కార్మిక చట్టాలను గౌరవించడం, చట్టాలను అమలు చేయడమే అని అన్నారు. పని గంటలు, వేతనాలు, విశ్రాంతి సమయం వంటి అంశాలలో స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, కొన్ని పరిశ్రమలు వాటిని పాటించడంలో విఫలమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరొక ఆందోళనకర అంశం ఏమిటంటే, కొన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ "హిందీ వారికి ప్రాముఖ్యత" అంటూ ప్రచారం జరగడం. ఇది స్థానిక కార్మికుల్లో అసంతృప్తి రేకెత్తించే ప్రమాదం ఉందన్నారు. సమానత్వం, న్యాయం అన్నవి కార్మిక రంగంలో ప్రధాన సూత్రాలు కావాలని, ప్రత్యేకంగా వలస కార్మికుల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోందన్నారు. తక్కువ వేతనాలు, అధిక పని గంటలు, భద్రత లేని వాతావరణం ఇవన్నీ వారిని ఆధునిక బానిసత్వం వైపు నెట్టేస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో, కార్మిక శాఖ అధికారులు తక్షణమే స్పందించి, నిబంధనలకు విరుద్ధంగా నడచుకునే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్టాలను కచ్చితంగా అమలు చేయడమే కాకుండా, వాటి అమలుపై కఠిన పర్యవేక్షణ అవసరం. లేబర్ కోడ్‌నిబంధనలు పూర్తిగా అమలు కావాలి. కార్మికుల హక్కులను ఎట్టి పరిస్థితుల్లోనూ హరించరాదు. పరిశ్రమల యాజమాన్యాలు చట్టాలను గౌరవిస్తూ నడుచుకోవాలి" అని డిమాండ్ చేశారు.కార్మికులు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. వారి శ్రేయస్సు కాపాడటం ప్రభుత్వం, యాజమాన్యాలు, సమాజం అందరి బాధ్యత. లేబర్ కోడ్ అమలు విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదన్నారు.

## దాడి కేసులో ఇద్దరు అరెస్టు

తొట్టంబేడు,మార్చి 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి అటెండర్‌పై శనివారం రాత్రి జరిగిన సంఘటనలో ఇద్దర్ని అరెస్టు చేసినట్లు టూటౌన్ సిఐ నాగరాజు ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరించారు.ఈ దాడి కేసులో పిల్లి మునిజయకృష్ణ ప్రసాద్ అలియాస్ మాస్,షేక్ హిదాయత్‌లను అరెస్టు చేసినట్లు వివరించారు.శీతలాంబ అలయం వద్ద శ్రీకాళహస్తికి చెందిన కుమార్,శివ ఇద్దరికి సంబంధించిన ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి ఈ సంఘటనకు సంబంధించిన చోటు చేసుకున్న సంఘటనలో దాడికి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు సిఐ నాగరాజు తెలిపారు.

## విశ్వబ్రాహ్మణుల గురించి పట్టించుకోని పాలకులు

శ్రీకాళహస్తి,మార్చి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని విశ్వబ్రాహ్మణుల గురించి ప్రభుత్వం పాలకులు పట్టించుకోవటం లేదని ఆదివారం జరిగిన నియోజకవర్గ సమావేశంలో వక్తలు ఆవేదన వ్యక్తం చేసారు.ధర్మరాజుల స్వామి ఆలయానికి సమీపంలోని విశ్వబ్రాహ్మణ సంఘానికి చెందిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సమాజం సర్వసభ్య సమావేశం బూడిదవాకం వెంకయ్య అధ్యక్షతన జరిగింది.నేడు ప్రభుత్వం విశ్వబ్రాహ్మణుల కోసం ఎన్నో పథకాలను రూపొంచారు. అయితే అవి ఆచరణలో అమలు జరగటం లేదన్నారు.ప్రభుత్వాలు ఎన్నో సంఘాలకు సమాజాలకు పథకాలు అందిస్తున్నారు.కానీ అవి మనకు చేరే సమయానికి ఎందుకో ఏ కారణం చేతనో అమలు జరగటం లేదన్నారు. ఇక సమాజంలో విశ్వ బ్రాహ్మణులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని వాటిని ఇటు పాలకులు కానీ,అటు ప్రభుత్వాధికారులు పట్టించుకోవటం లేదన్నారు.ముఖ్యంగా నిరుపేదలకు ఇళ్ళ స్థలాల్లేదు. ఎన్నో సార్లు అభ్యర్థిస్తున్నా అమలు జరగటం లేదన్నారు.అలాగే పక్కాగృహాల మంజూరులో వెనుకబడి ఉన్నారన్నారు.సమావేశంలో వెంకయ్యతో పాటు మోహన్ ఆచారి, రమణయ్యఆచార్యులు, రాజా ఆచార్యులు, రాజేష్ ఆచార్యులు హరిఆచారి, మాధవాచారి తదితరులు పాల్గొని వివిధ సమస్యలపై చర్చించారు.

## శివయ్య సేవలో జడ్జి

శ్రీకాళహస్తి,మార్చి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిట కిట లాడింది. వరుస సెలవులతో భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. ఈనేపధ్యంలో హైకోర్టు జడ్జి జస్టీస్ హరిహరనాధశర్మ కుటుంబసభ్యులతో వాయులింగేశ్వరుని దర్శనానికి వచ్చారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో ఆలయ మర్యాదలతో మేళ తాళాలతో స్వాగతం పలికారు. వారితో పాటు స్థానిక ప్రోటోకాల్ జడ్జి శ్రీనివాసనాయక్ జడ్జిల బేబీరాణి, కృష్ణప్రియ, కోర్టు పర్యవేక్షకులు రవిలు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు, స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఆలయం లోపల ఏర్పాట్లును ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, ఇన్సెపెక్టర్ వెంకటస్వామి పర్యవేక్షించారు.

## రణభేరి 3.0ను జయప్రదం చేయండి : వెంకటకృష్ణయ్య

సత్యవేడు, మార్చి 22 ప్రభాతవార్త:

సత్యవేడు మండలంలో ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలపై రణభేరి 3.0 పేరిట ఈ నెల 24వ తేదీ మంగళవారం సత్యవేడు నియోజకవర్గం కేంద్రంలో జరగనున్న ఒక రోజు నిరాహారదీక్షను జయప్రదం చేయాలని యూటీఎఫ్ తిరుపతి జిల్లా కార్యదర్శి వెంకటకృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న వారిచ్చిన హామీలను, ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, పెండింగ్ డీఏలు, బకాయిల చెల్లింపు, మెమో నంబరు 57 వర్తింపు, సీపీఎస్ రద్దు తదితర ఆర్థిక సమస్యల సాధనకై మంగళవారం సత్యవేడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న నిరాహారదీక్షకు నియోజకవర్గంలోని 7 మండలానికి చెందిన యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్నారు.

# గంజాయి అరికట్టడం సామాజిక బాధ్యత ఉద్యమించాలి!



శ్రీకాళహస్తి, మార్చి 22 ప్రభాతవార్త

## గంజాయి అరికట్టడం సామాజిక బాధ్యత ఉద్యమించాలి!

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో గంజాయిని అరికట్టడం అందరి సామాజిక బాధ్యతగా స్వీకరించాలని బిసి విభాగం తెలుగుదేశం నాయకులు పిలుపు నిచ్చారు.ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహాక కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావు,వజ్రం కిషోర్‌లు పిలుపు నిచ్చారు. ప్రజల మానప్రాణాలకు ప్రమాదకరంగా మారి సమాజానికి పెనుముప్పుగా గంజాయిని అరికట్టడం ఒక సామాజిక బాధ్యతగా ప్రజలు ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. శనివారం రాత్రి కొత్తపేట వద్ద జరిగిన ఓ సంఘటనలో కొందరు వ్యక్తుఉ బాధితులపై విచక్షణారహితంగా దాడులు చేయటం దానిని నిలువరించే ప్రయత్నం చేసిన వ్యక్తులనుకిడ్నాప్ చేయటం దాడులు చేసి గాయపరచటం హత్యాయత్నానికి పాల్పడటం గమనిస్తే పుణ్యక్షేత్రంలో గంజాయి సేవకులు ఎలా వ్యవహరిస్తున్నారో అర్థమౌతుందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తెలుగుదేశం ఇన్‌చార్జి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆరాచక శక్తులను ఆరికట్టుటకు పోలీసులకు సూచనలు చేస్తూనే ఉన్నారన్నారు. గంజాయిని అరికటట్టడం ఒక్క ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమౌతుందన్నారు.ఈ కార్యక్రమాలకు ప్రజలుముందుకు వచ్చి ఉద్యమించి అధికారులకు సహాకరించాలన్నారు.ఈ సమావేశంలో డాక్టర్ జి,ధశరధాచ్చారి, మిన్నల్ రవి, భీమాల భాస్కర్,కోట చంద్రశేఖర్ వజ్రం కిషోర్, బీమాల చంద్రబాబు,షేక్ మహాబూబ్‌బాషా, సుబ్బయ్య, అనందరెడ్డి, ముజీబ్, భగత్,సులేమాన్,రమేష్,ఆదిల్ ,వెంకటస్వామి,కృష్ణయ్య, సుబ్రమణ్యం మారయ్య, సాలార్ తదితరులు పాల్గొన్నారు.